TELANGANA SHASANA SABHA TELTEL/2016/68867

తెలంగాణ శాసనసభ

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : పోలగోని రాజేష్

Published from Hyderabad, Rangareddy, Nalgonda, Mahabubnagar, Khammam సంపుటి : 2 సంచిక : 95 పేజీలు : 8 సోమవారం 9 సెప్టెంబర్ 2024 వెల : 4/-

రిపోర్టర్లు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ శాసనసభ తెలుగు దినపత్రికకు రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తిగల, అనుభవం కలిగిన అభ్యర్థులు కావలెను..

తెలంగాణ శాసనసభ తెలుగు దినపత్రిక నెట్వర్క్ ఇంచార్జ్
పి.వెంకటేష్
9949360937,9100900931

విలువలు దాటితే మేము దాటుతాం

- జర్నలిస్టులకు ఇళ్ల పట్టాల పంపిణీలో సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు
- కొంతమంది జర్నలిస్ట్‌లు రాజకీయ పార్టీలకు కార్యకర్తలుగా వ్యవహరిస్తున్నారు
- జర్నలిస్ట్‌లు హద్దులు దాటి వ్యవహారించకూడదు
- "కొంతమంది జర్నలిస్టులు చీఫ్ మినిస్టర్‌ను చీప్ మినిస్టర్ అంటూ కుర్చీకు ఉన్న గౌరవం పోగొడుతున్నారు
- అక్రిడిటేషన్ విషయంలో ఈసారి కచ్చితంగా నిబంధనలు ఉంటాయి
- జర్నలిస్ట్‌లకు పార్లమెంటరీ పార్టీ వ్యవస్థలో చాలా గౌరవ మర్యాదలు ఉంటాయి.

హైదరాబాద్

జవహర్ లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం ఈరోజు (ఆదివారం) రవీంద్రభారతిలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఇళ్ల పట్టాలను జర్నలిస్టులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... కొంతమంది జర్నలిస్ట్‌లు రాజకీయ పార్టీలకు కార్యకర్తలుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జర్నలిస్ట్‌లు హద్దులు దాటి వ్యవహారించకూడదని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, జర్నలిస్టు సంఘాల నాయకులు, అధికారులు హాజరయ్యారు. "కొంతమంది జర్నలిస్టులు చీఫ్ మినిస్టర్‌ను చీప్ మినిస్టర్ అంటూ కుర్చీకు ఉన్న గౌరవం పోగొడుతున్నారు. వ్యక్తి నచ్చక పోవచ్చు వ్యవస్థలో గౌరవప్రదమైన పదవికి విలువ ఇవ్వాలి.

- మిగతా3లో

వరదలపై రాజకీయం సరికాదు

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- నిత్యావసరాల పంపిణీ, పునరావాస కార్యక్రమాలపై ఆరా
- "ప్రకృతి వైపరిత్యాలు వంటి విపత్కర పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాలి
- ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవ చేయాలి
- తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం అడ్వాన్స్ డిజాస్టర్ ఫండ్ కింద రూ.1,300 కోట్లు పంపింది
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మున్నేరు వరద బాధితులకు అండగా ఉంటాయి.

గుజరాత్ గ్రామాల్లో కలకలం

- పిల్లలతో సహా 12 మంది తీవ్ర జ్వరంతో మృతి
- జ్వరం, జలుబు, దగ్గ, న్యుమోనియా, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందితో రోగులు
- రోగం ఏమిటన్నది డాక్టర్లు సైతం గుర్తించలేకపోతున్నట్లు ఆ గ్రామస్తులు ఆరోపణ

కొండంత సాయం

- కాంగ్రెస్ కీలక నిర్ణయం..
- వరద బాధితులకు ఊహించని విరాళం
- భారీ వర్షాలతో అతలాకుతలమైన ఖమ్మంను ఆదుకోవడానికి కాంగ్రెస్ కొండంత సాయం
- వరద బాధితుల కోసం రెండు నెలల జీతాన్ని ఇవ్వాలని ప్రజాప్రతినిధుల నిర్ణయం
- పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు పలు కార్పోరేషన్ల చైర్మన్లు కూడా

హైదరాబాద్/ఖమ్మం

ఎగిరిపోయిన పైకప్పులు, కూలిన గోడలు, కొట్టుకుపోయిన ఇళు...! ఖమ్మంలో మున్నేరు విలయంతో ఎటుచూసినా విషాద గాథలే..! ఏ వీధిలో తిరగాలన్నా అంతా బురదే..! ఏ ఇంట్లో చూసినా మట్టికొట్టుకున్న వస్తువులు, దుస్తులే..! కొందరికి ఇవీ లేవు. ఆయా ప్రాంతాల్లో ఏ ఇల్లాలిని కదిలించినా కన్నీరే. మున్నేరు ఉగ్రరూపం దాల్చి 36 అడుగుల మేర ప్రవహించడంతో నది తీరాన ఉన్న ప్రాంతాల్లో వేల ఆవాసాలు నీట మునిగాయి. ఇలా ఒకటా రెండా ఎటు చూసినా హృదయాలను కదిలించే దృశ్యాలే!. ఇప్పుడిప్పుడే అటు మున్నేరు కాస్త శాంతించగా.. ఇటు ఖమ్మం నగర వాసులు

- మిగతా3లో

ఈడీ తనిఖీలు.. రూ. 6.5 కోట్ల విలువైన బంగారం పట్టివేత

- భారీ నగదు, పలు డాక్యుమెంట్లను సైతం ఈడీ అధికారుల స్వాధీనం
- ఢిల్లీ వేదికగా జరిగే తమ విచారణకు హాజరు కావాలని స్వపన్‌కు సమన్లు జారీ



కూల్చి వేతలకు చెక్ పెట్టనుందా?

- ప్రజా వ్యతిరేకతతో హైడ్రా కీలక ప్రకటన..
- ఎలాంటి సమాచారం లేకుండా, కనీసం ఇంట్లోని సమాను తీసుకునే సమయం ఇవ్వకుండా ఇండ్లు కూల్చివేస్తుండటంతో పేదలు, మధ్య తరగతి వర్గాల నుంచి వ్యతిరేకత
- ఆల్రెడీ నివాసం ఉంటున్న గృహాలను కూల్చం. కొత్త నిర్మాణాలు మాత్రమే కూలుస్తున్నామని వివరణ
- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉన్న నిర్మాణాలు స్థలాలు ఇకపై కొనవద్దని హైడ్రా సూచించింది.

కాంగ్రెస్ పాలనలో రైతుల కష్టాలు

- రేవంత్‌ను చూసి ఊసరవెల్లులు కూడా సిగ్గుపడుతున్నాయి..
- హరీశ్‌రావు సైటెర్లు
- ఈ 9 నెలల కాలంలోనే 475 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు
- నీ పాలన ఎలా ఉందంటే ఎన్నికల ముందు ఒక మాట, కుర్చీ ఎక్కిన తర్వాత ఒక మాట

హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారని, ఈ 9 నెలల కాలంలోనే 475 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. రేవంత్ రెడ్డిని చూసి ఊసరవెల్లులు కూడా సిగ్గుపడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో హరీశ్ రావు మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి పాలనలో ఈ రోజు వరకు 475 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. లిస్ట్ అడిగితే గంటలో పంపించాను.. అయినా ఆదుకోలేదు.. స్పందించలేదు. నీ పాలన ఎలా ఉందంటే ఎన్నికల ముందు ఒక మాట, కుర్చీ ఎక్కిన తర్వాత ఒక మాట, బడ్జెట్‌లో ఒక మాట, పార్లమెంట్ ఎన్నికలకు ముందు, ఎన్నికల తర్వాత ఒక మాట.. పూటకో మాట మాట్లాడుతున్నావ్. పొద్దు తిరుగుడు పువ్వు కంటే వేగంగా మారుతున్నవ్. ఊసరవెల్లులు కూడా నిన్ను చూసి సిగ్గుపడుతున్నాయి. ఎన్నికల ముందు ఏం చెప్పవ్.. అప్పులు తెచ్చుకోండి డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తా అన్నావ్.. కుటుంబానికి ఒక్కరికే చేస్తా అని చెప్పలేదు కదా..? అని హరీశ్‌రావు నిలదీశారు. ఎన్నికలు అయిపోయాక మాట్లాడుతూ.. ఒక సంవత్సరం కడుపు కట్టుకుంటే రూ. 49 వేల కోట్ల రుణాలు మాఫీ చేసేస్తా అన్నవ్. మరి ఎందుకు కోతలు పెడుతున్నావ్.. కేబినెట్ మీటింగ్ అయ్యాక నీవే ప్రెస్ మీట్ పెట్టి రూ. 31వేల కోట్లు 41 లక్షల మంది రైతులకు మాఫీ చేస్తా అన్నవ్. బడ్జెట్‌లో చూస్తే రూ. 26 లక్షల కోట్లు

- మిగతా3లో

అందరి టార్గెట్ జమ్మూకశ్మీర్.. బీజేపీ ఆరో జాబితా విడుదల

జమ్మూకశ్మీర్ శాసనసభ ఎన్నికలు దేశం దృష్టిని ఆకర్షిస్తున్నాయి. అన్ని రాజకీయ పార్టీలు జమ్మూకశ్మీర్‌లో గెలుపుపై ఫోకస్ పెట్టాయి. 370 ఆర్టికల్ రద్దు తర్వాత మొదటిసారి జరుగుతున్న ఎన్నికల్లో సత్తా చాటేందుకు అన్ని పార్టీలు వ్యూహాలు రూపొందిస్తున్నాయి. కాంగ్రెస్, బీజేపీతో పాటు పలుమ ప్రాంతీయ పార్టీలు జమ్మూకశ్మీర్‌లో గెలుపు కోసం శ్రమిస్తున్నాయి. కాంగ్రెస్ నేషనల్ కాన్ఫరెన్స్‌తో పొత్తు పెట్టుకుంది. గెలుపుపై కాంగ్రెస్, ఎన్సీ కూటమి భారీ ఆశలు పెట్టుకుంది. తొలిసారి జమ్మూకశ్మీర్‌లో అన్ని రాజకీయ పార్టీలు తీవ్ర పోటీని ఎదుర్కొంటున్నాయి. ఎన్నికల సమయం దగ్గరపడుతుండటంతో అన్ని పార్టీలు అభ్యర్థులను ఖరారు చేసే పనిలో ఉన్నాయి. తాజాగా బీజేపీ 10 మంది అభ్యర్థులతో ఆరో జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలోనూ జమ్మూకశ్మీర్ మాజీ డిప్యూటీ సీఎం కవీందర్ గుప్తాకు టికెట్ కేటాయించలేదు. 2014 ఎన్నికల్లో ఆయన గాంధీ నగర్ శాసనసభ స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

ఆరో జాబితా..

బీజేపీ తన ఆరో జాబితాలో 10 మంది అభ్యర్థులను ప్రకటించింది. కర్నా నుంచి మహ్మద్ ఇద్రీస్ కర్నాహి, హంద్వారా నుంచి గులామ్ మహ్మద్ మీర్, సోనావారి నుంచి అబ్దుల్ రషీద్ ఖాన్, బందిపోరా నుంచి నసీర్ అహ్మద్ లోన్, గురేజ్ నుంచి ఫకీర్ మహ్మద్ ఖాన్, ఉదంపూర్ ఈస్ట్ నుంచి ఆర్ ఎస్ పఠానియా, కతువా నుంచి డాక్టర్ భరత్ భూషణ్, బిష్నా నుంచి రాజీవ్ భగత్, బహు నుంచి విక్రమ్ రంధావా, మార్ నుంచి సురీందర్ భగత్‌కు బీజేపీ టికెట్లు కేటాయించింది.

అక్టోబర్8న ఫలితాలు

జమ్మూ కాశ్మీర్‌లోని 90 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఏడు నియోజకవర్గాలు ఎస్సీలకు, 9 నియోజకవర్గాలు ఎస్టీలకు రిజర్వు చేశారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పీడీపీ) 28 సీట్లు గెలుచుకోగా, బీజేపీ 25, జమ్మూ కాశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) 15, కాంగ్రెస్ 12 సీట్లు గెలుచుకున్నాయి. జమ్మూ కాశ్మీర్‌లో మూడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. తొలిదశ పోలింగ్ సెప్టెంబర్ 18న, రెండోదశ సెప్టెంబర్ 25, అక్టోబర్1న మూడో దశ పోలింగ్ జరుగుతుంది. అక్టోబర్8న ఓట్ల లెక్కింపు చేపడతారు.

బీజేపీ హామీలు ఇవే..

జమ్మూకశ్మీర్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడమే లక్ష్యంగా బీజేపీ ఎన్నికల వ్యూహాలను రూపొందిస్తోంది. దీనిలో భాగంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో జమ్మూకశ్మీర్‌లో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే మెట్రో కనెక్టివిటీ, అమ్యూజ్‌మెంట్ పార్కులను ఏర్పాటు చేసి ప్రతి వృద్ధ మహిళకు ప్రతి సంవత్సరం రూ.18వేలు ఇచ్చేలా 'మా సమ్మాన్ యోజన'ను తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఉజ్వల పథకం కింద ప్రతి సంవత్సరం రెండు ఉచిత గ్యాస్ సిలిండర్లను ఇస్తామని, ప్రగతి శిక్షా యోజన కింద కళాశాల విద్యార్థులకు ప్రయాణ భత్యం కింద ఏడాదికి రూ.3,000 ఇస్తామని బీజేపీ తన ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొంది.

ఎంపీ పదవికి రాజీనామా.. సీఎం మమతకు ఘాటు లేఖ

కోల్‌కతా : ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ట్రైయినీ వైద్యురాలిపై హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ హత్యాచార ఘటనతోపాటు అనంతరం చోటు చేసుకున్న పరిణామాలపై మమతా బెనర్జీ ప్రభుత్వం వ్యవహరించిన తీరు పట్ల సర్వత్రా ఆరోపణలు అయితే వెల్లువెత్తాయి. అలాంటి వేళ అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నేత జవహర్ సిర్కార్.. తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు పార్టీ అధినేత్రి, సీఎం మమతా బెనర్జీకి ఆదివారం ఆయన లేఖ రాశారు. ట్రైయినీ వైద్యురాలి హత్యాచార ఘటన అనంతరం రాష్ట్రంలో ఆందోళనలను అరికట్టడంలో పార్టీ ఘోర వైఫల్యం చెందిందన్నారు. పార్టీలో చోటు చేసుకున్న అవినీతిపై సీఎం మమతా బెనర్జీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. సీఎం మమతా బెనర్జీతో భేటీ అయి మాట్లాడేందుకు తనకు గత కొన్ని నెలలుగా ప్రయత్నిస్తున్నా.. అవకాశమే ఇవ్వడం లేదని జవహర్ సిర్కార్ పేర్కొన్నారు. ఈ ప్రభుత్వ హయాంలో అవినీతికి పాల్పడిన పలువురు ఉన్నతాధికారులు కీలక పదవుల్లో కొనసాగుతున్నారన్నారు. వైద్యురాలిపై హత్యాచారం అనంతరం రాష్ట్రంలో జరిగిన ఆందోళనలతో.. ఈ ప్రభుత్వ



వెనుక ప్రజలు లేరనే విషయం స్పష్టమైందని చెప్పారు. ఈ హత్యాచార ఘటన కారణంగా జూనియర్ డాక్టర్లు ఆందోళన చేపట్టారని.. ఈ నేపథ్యంలో గతంలో వలే ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కఠిన చర్యలు తీసుకుంటారని తాను భావించానన్నారు. అందుకోసం ఈ ఘటన జరిగిన నాటి నుంచి తాను వేచి చూసినట్లు తెలిపారు. కానీ అలాంటి చర్యలు ఏమీ ఆమె తీసుకోలేదన్నారు. అంతేకాదు.. ఈ హత్యాచార ఘటన అనంతరం మమతా బెనర్జీ ప్రభుత్వం చేపట్టిన చర్యలు తీవ్ర ఆక్షేపణీయంగా ఉన్నాయని విమర్శించారు. అలాగే పార్టీలో, ప్రభుత్వంలో చోటు చేసుకుంటున్న పరిణామాలను చక్కదిద్దాలని ఈ సందర్భంగా పార్టీ అధినేత్రి, సీఎం మమతా బెనర్జీకి ఆయన సూచించారు. అలా కాకుంటే.. రాష్ట్రం మతోన్మాద శక్తుల చేతుల్లోకి వెళ్లి పోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తాను ఎంపీగా ఉన్న ఈ మూడేళ్లలో... పెద్దల సభలో రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను లేవనెత్తిన విషయాన్ని ఈ సందర్భంగా జవహర్ సిర్కార్ గుర్తు చేశారు. తన పోరాటమంతా అవినీతితోపాటు మతతత్వంపైనేనని ఈ సందర్భంగా జవహర్ స్పష్టం చేశారు. మరోవైపు ఆర్ జీ కర్ కాలేజీ వైద్యురాలు హత్యాచారం ఘటన నేపథ్యంలో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నేతలు స్పందించిన తీరుతో పాటు.. ఆ పార్టీ నేతలపై విమర్శలు సైతం వెల్లువెత్తాయి. ఆ క్రమంలో ఈ ఘటనపై స్పందించిన శంతన్ సేన్‌పై పార్టీ సస్పెన్షన్ వేటు వేసింది. అలాగే ఈ హత్యాచార ఘటనలో పార్టీ ప్రముఖ నేత సుఖేంద్ శేఖర్ రేను సైతం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఆధార్ కార్డు జారీ ఇక అంత ఈజీ కాదు



అసోం: ఆధార్ కార్డు జారీపై అసోం ప్రభుత్వం కొత్త రూల్ విధించింది. ఇక నుంచి రాష్ట్రంలో కొత్తగా ఆధార్ కార్డు కావాలనుకునే వారు తప్పనిసరిగా తమ జాతీయ పౌర నమోదు నంబర్‌ను సమర్పించాల్సి ఉంటుంది. అక్టోబర్ 1 నుంచి ఈ కొత్త విధానం అమల్లోకి రానున్నట్టు అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ (%ుఅఝుత్ఝ దీఅంఝు ఝుతీఝు%) శనివారంనాడు ప్రకటించారు. జనాభా కంటే ఆధార్ కార్డు కోసం అప్లికేషన్లు ఎక్కువగా ఉన్నట్టు తమ దృష్టికి వచ్చిందని, అనుమానిత వ్యక్తులు ఇందులో ఉన్నట్టు అర్ధమవుతోందని చెప్పారు. అక్రమ వలసలను అరికట్టడంలో భాగంగానే ఇక నుంచి ఆధార్ కార్డుల జారీ విషయంలో కఠినంగా వ్యవహరించాలని తమ ప్రభుత్వం నిర్ణయించినట్టు చెప్పారు. ఇక నుంచి అసోంలో ఆధార్ కార్డులు పొందడం అంత సులభం కాదన్నారు. ఎన్ఆర్సీ సమయంలో బయోమెట్రిక్ లాక్ అయిన 9.55 లక్షల మందికి ఎన్ఆర్సీ అప్లికేషన్ నెంబర్ జత చేయాల్సిన అవసరం లేదని, అక్రమంగా అసోంలోకి చొరబడే వారిని గుర్తించే ప్రక్రియను వేగవంతం చేశామని, గత రెండు నెలల్లో పలువురు బంగ్లాదేశీయ ఎలను పట్టుకుని ఆ దేశ అధికారులకు అప్పగించామని తెలిపారు.

బలవంతపు వసూళ్ల కోసం దుండగులు యత్నం

న్యూఢిల్లీ: క్లబ్ యజమాని నుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేసేందుకు కొందరు దుండగులు ప్రయత్నించారు. క్లబ్ వద్దకు వచ్చిన సాయుధులు అక్కడున్న బౌన్సర్లను మోకాలుపై కూర్చొవాలని బెదిరించారు. ఆ తర్వాత క్లబ్‌లోకి వెళ్లారు. ఎవరూ లేకపోవడంతో ఆగ్రహంతో ఓనర్‌ను తిట్లారు. ఆ క్లబ్ బయట గాల్లోకి కాల్పులు జరిపారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. గురువారం అర్ధరాత్రి వేళ ఈశాన్య ఢిల్లీలోని సీమాపురి ప్రాంతంలో ఉన్న కాంచ్ క్లబ్ వద్దకు ముగ్గురు సాయుధులు వచ్చారు. గన్ తీసిన ఒక వ్యక్తి మహిళతో సహా ఇద్దరు బౌన్సర్లను మోకాలుపై కూర్చోవాలని బెదిరించాడు. పైకి లేస్తే వారి తలపై కాల్చివేస్తానని హెచ్చరించారు. కాగా, మరో ఇద్దరు వ్యక్తులు ఆ క్లబ్‌లోకి వెళ్లారు. యజమానిని బెదిరించి డబ్బులు వసూలు చేయాలని భావించారు. అయితే క్లబ్ లోపల ఎవరూ లేకపోవడంతో బయటకు వచ్చారు. ఓనర్‌ను తిడుతూ క్లబ్ వద్ద గాల్లోకి కాల్పులు జరిపారు. ఆ తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయారు. మరోవైపు ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఆ క్లబ్ వద్దకు చేరుకున్నారు. అక్కడున్న సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. నిందితుల్లో ఒకరిని ఘజియాబాద్‌కు చెందిన షారుక్‌గా గుర్తించి అరెస్ట్ చేశారు. మిగతా నిందితుల కోసం వెతుకుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. కాగా, సీసీటీవీలో రికార్డైన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

మణిపూర్‌లో మళ్లీ చెలరేగిన హింస.. ఆరుగురు మృతి

ఇంఫాల్ : ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో మళ్లీ హింస చెలరేగింది. జిరిబామ్ జిల్లాలో ఆరుగురు మృతి చెందారు. శనివారం ఉదయం ఓ వ్యక్తిని నిద్రలోనే కాల్చి చంపారు. దీంతో ఇరు వర్గాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. కాల్పులు కూడా చోటు చేసుకున్నాయి. ఈ కాల్పుల్లో మరో ఐదుగురు సాయుధులు ప్రాణాలు కోల్పోయినట్లు మణిపూర్ పోలీసులు పేర్కొన్నారు. మరోవైపు చూరాచాంద్‌పూర్‌లో మిలిటెంట్లకు చెందిన మూడు బంకర్లను భద్రతా బలగాలు ధ్వంసం చేశాయి. బిష్ణుపూర్ జిల్లాలో రాకెట్ దాడులను ఇక్కడ్నుంచే చేపట్టినట్లు తెలుస్తోంది. రాకెట్ దాడుల్లో ఓ వృద్ధుడు ప్రాణాలు కోల్పోగా, మరో ఆరుగురు తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. తొలి రాకెట్ దాడి తెల్లవారుజామున 4.30 గంటలకు ట్రోంగ్లావ్‌బిలో చోటు చేసుకుంది. ఈ దాడిలో రెండు నిర్మాణాలు దెబ్బతిన్నాయి. రెండో దాడి మ. 3 గంటలకు మొయిరంగ్‌లోని మాజీ సీఎం మైరెంబమ్ కొయిరెంగ్ నివాస ఆవరణలో జరిగింది. రాకెట్‌కు అమర్చిన బాంబులు పేలడంతో వృద్ధుడు మృతి చెందాడు. ఈ పరిణామాల నేపథ్యంలో చూరాచాంద్‌పూర్‌లోని మువాల్‌సంగ్, లైకా మువాల్సు గ్రామాల్లో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి మూడు బంకర్లను కూల్చేశారు పోలీసులు.

ఈడీ తనిఖీలు.. రూ. 6.5 కోట్ల విలువైన బంగారం పట్టివేత

కోల్‌కతా, సెప్టెంబర్ 08: కోల్‌కతాలో వ్యాపారవేత్త స్వపన్ సాహా నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ఆదివారం సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 9 కేజీల బంగారాన్ని ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనితోపాటు భారీ నగదు, పలు డాక్యుమెంట్లను సైతం ఈడీ అధికారులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న ఈ బంగారం విలువ రూ. 6.5 కోట్లు ఉంటుందని వారు వివరించారు. పట్టుబడిన బంగారంపై పలు ప్రశ్నలు సంధించగా.. వాటిని సరైన సమాధానాలు స్వపన్ సాహా ఇవ్వలేదన్నారు. ఈ నేపథ్యంలో మరికొద్ది రోజుల్లో ఢిల్లీ వేదికగా జరిగే తమ విచారణకు హాజరు కావాలని స్వపన్‌కు సమన్లు జారీ చేసినట్లు ఈడీ అధికారులు వెల్లడించారు. ఈ సోదాల్లో భారీ ఎత్తున బంగారం లభించడంతో.. అందుకు సంబంధించిన పత్రాలను సైతం ఢిల్లీకి తీసుకు రావాలని ఆ సమన్లలో ఈడీ స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్‌లో కోట్లాది రూపాయల బ్యాంకు మోసం కేసులో స్వపన్ సాహాపై భారీగా ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో కోల్‌కతా మహానగరంలో సాల్ట్ లేక్‌లోని స్వపన్ సాహా నివాసంలో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు.

గుజరాత్ గ్రామాల్లో కలకలం

అహ్మదాబాద్: నలుగురు పిల్లలతో సహా 12 మంది తీవ్ర జ్వరం వల్ల మరణించారు. శ్వాస తీసుకోవడంలో కూడా ఇబ్బంది కలుగుతున్నదని రోగులు వాపోయారు. అయితే రోగం ఏమిటన్నది డాక్టర్లు సైతం గుర్తించలేకపోతున్నట్లు ఆ గ్రామస్తులు ఆరోపించారు. గుజరాత్‌లోని కచ్ జిల్లాలో ఈ పరిస్థితి నెలకొన్నది. లఖ్‌పత్ తాలూకాలోని బెఖాడా, సనాంద్రో, మోర్గార్, భరవంద్ గ్రామాల్లో జనం వింత రోగాల బారిన పడుతున్నారు. జ్వరం, జలుబు, దగ్గు, న్యుమోనియా, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందితో రోగులు బాధపడుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. సెప్టెంబర్ 3 నుంచి ఇప్పటి వరకు నలుగురు పిల్లలతో సహా 12 మంది తీవ్ర జ్వరంతో మరణించినట్లు చెప్పారు. భారీ వర్షాలకు ప్రభావితమైన ఈ ప్రాంతంలో రోగులకు వ్యాపిస్తున్న వ్యాధి ఏమిటన్నది డాక్టర్లు కూడా కచ్చితంగా నిర్ధారించలేకపోయినట్లు గ్రామస్తులు ఆరోపించారు. కాగా, ఈ మరణాలకు ప్రధాన కారణం న్యుమోనైటిస్ అని అధికారులు ఆదివారం తెలిపారు. హెచ్1ఎన్1, స్వైన్ ఫ్లూ, క్రిమియన్-కాంగో ఫీవర్, మలేరియా, డెంగ్యూ అవకాశాలను తోసిపుచ్చలేమని చెప్పారు. పాకిస్థాన్ సరిహద్దు సమీపంలో ఉన్న ఈ తాలూకాలో వైద్య సేవలను ముమ్మరం చేసినట్లు కచ్ కలెక్టర్ అమిత్ అరోరా తెలిపారు. వైద్య బృందాలను అక్కడకు పంపడంతోపాటు రోగుల నుంచి నమూనాలు సేకరిస్తున్నట్లు వెల్లడించారు.

దేశంలో మంకీపాక్స్ తొలి కేసు?.. భయాందోళన వద్దన్న కేంద్రం

TEST
mpox virus

న్యూఢిల్లీ: ప్రపంచాన్ని భయపెడుతున్న మంకీపాక్స్ తొలి కేసు దేశంలో నమోదైనట్లు తెలుస్తున్నది. ఈ వైరస్ లక్షణాలున్న వ్యక్తికి ఎంపాక్స్ సోకినట్లు అనుమానిస్తున్నారు. ప్రత్యేక ఆసుపత్రిలోని ఐసొలేషన్‌లో అతడ్ని ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఆ వ్యక్తి నుంచి సేకరించిన నమూనాలను పరీక్షకు పంపినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. అయితే ప్రజలు ఎలాంటి భయాందోళన చెందవద్దని పేర్కొంది. ఎంపాక్స్ వైరస్‌తో పోరాడుతున్న దేశం నుంచి ఇటీవల భారత్‌కు తిరిగి వచ్చిన యువకుడ్ని అనుమానిత కేసుగా గుర్తించినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆదివారం తెలిపింది. ఆ రోగిని ఐసొలేషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నట్లు చెప్పింది. అతడి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు పేర్కొంది. ఆ వ్యక్తికి ఎంపాక్స్ సోకిందా లేదా అన్నది నిర్ధారించేందుకు అతడి నమూనాలను పరీక్ష కోసం పంపినట్లు వెల్లడించింది. కాగా, ఎంపాక్స్‌కు సంబంధించిన ప్రోటోకాల్‌కు అనుగుణంగా ఈ కేసును డీల్ చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఆ వ్యక్తిని కలిసిన వారిని గుర్తించేందుకు, అతడి నుంచి వైరస్ వ్యాప్తిని నిర్ధారించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్సీడీసీ) జారీ చేసిన ప్రమాద అంచనాలకు అనుగుణంగా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించింది. ఈ నేపథ్యంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. మంకీపాక్స్‌ను ఎదుర్కొనేందుకు పూర్తి సిద్ధంగా ఉన్నట్లు వివరించింది. మరోవైపు తాజాగా ప్రపంచాన్ని వణికిస్తున్న ఎంపాక్స్ వ్యాప్తిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా గత నెలలో ప్రకటించింది. 2022 జనవరి నుంచి 2024 ఆగస్ట్ వరకు 120కుపైగా దేశాల్లో ఎంపాక్స్ వ్యాప్తి చెందినట్లు తెలిపింది. లక్షకుపైగా కేసులు నిర్ధారణ కాగా, 220కుపైగా మరణాలు నమోదైనట్లు పేర్కొంది.

కొండంత సాయం..

-మొదటిపేజీ తరువాయి

కాస్త ఊపిరిపీల్చుకుంటున్నారు. అయితే.. వరద బాధితులను ఆదుకునేందుకు ఎంతోమంది సినీ, రాజకీయ ప్రముఖులు ముందుకొచ్చారు. సామాన్య ప్రజలు మొదలుకుని సెలబ్రిటీలు, పలు రంగాల పెద్దలు ముందుకొచ్చి తమకు తోచినంత విరాళంగా ప్రకటించారు. వారు ప్రకటించిన సొమ్ము అంతా చెక్కులు, నేరుగా నగదు, ఆన్‌లైన్ రూపంలో ఇప్పటికే సీఎం సీఎం సహాయ నిధికి అందజేశారు. ఇక 'మేము సైతం' అంటూ తెలంగాణాలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ముందుకొచ్చి కొండంత సాయం చేసింది.

కొండంత సాయం..

భారీ వర్షాలతో అతలాకుతలమైన ఖమ్మంను ఆదుకోవడానికి కాంగ్రెస్ కొండంత సాయం చేసింది. వరద బాధితుల విషయంలో కాంగ్రెస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. వరద బాధితుల కోసం రెండు నెలల జీతాన్ని ఇవ్వాలని ప్రజాప్రతినిధులు నిర్ణయించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు తమ రెండు నెలల జీతాన్ని సీఎం సహాయనిధికి ఇస్తున్నట్లు ప్రకటించారు. ఇందులో పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు పలు కార్పోరేషన్ల చైర్మన్లు కూడా ఉన్నారు. వీరంతా తమ రెండు నెలల జీతాన్ని సీఎం సహాయ నిధికి విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించడం జరిగింది. వీరితో పాటు ప్రభుత్వ సలహాదారులు సైతం తమ రెండు నెలలు జీతం ముఖ్యమంత్రి సహాయనిధికి ఇవ్వాలని నిర్ణయించారు. కాంగ్రెస్ నేతలంతా.. సీఎం రేవంత్ రెడ్డి, కొత్త పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు.

రాష్ట్ర, కేంద్ర మంత్రులు ఇలా..!

కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల నిర్ణయం పట్ల సామాన్య ప్రజలు, వరద బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇక వరద బాధిత ప్రాంతాల్లో పరిస్థితులపై ఎప్పటికప్పుడు సీఎం రేవంత్ రెడ్డి సమీక్షలు నిర్వహిస్తూనే ఉన్నారు. మరోవైపు.. సహాయక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇక సమీక్షలు, సమావేశాలు రద్దు చేసుకుని మరీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులు వరద ప్రభావిత ప్రాంతాల్లోనే ఉంటున్నారు. ఇప్పటికే కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఖమ్మంలో పర్యటించగా.. ఆదివారం నాడు మరో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కూడా పర్యటించారు. వరద బాధితులను కేంద్రం తప్పకుండా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నివేదిక వచ్చిన వెంటనే పూర్తి నిధులు వస్తాయన్నారు. వరద సాయం విషయంలో కేంద్రానికి వివక్ష లేదని.. స్టేట్ డిజాస్టర్ నిధులతో వరద బాధితులను ఆదుకోవాలన్నారు. మరోసారి తుఫాన్ ముప్పు పొంచి ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని కిషన్ రెడ్డి సూచించారు.

విలువలు దాటితే మేము దాటుతాం..

-మొదటిపేజీ తరువాయి

ఎదుటి వారు విలువలు దాటితే మేము దాటుతాం. అక్రిడిటేషన్ విషయంలో ఈసారి కచ్చితంగా నిబంధనలు ఉంటాయి. జర్నలిస్ట్‌లకు పార్లమెంటరీ పార్టీ వ్యవస్థలో చాలా గౌరవ మర్యాదలు ఉంటాయి. ఇక్కడ ఉన్న వారు ఎలా ఉన్నారో ఆలోచన చేయాలి. కొన్ని సందర్భాల్లో చిట్‌చాట్‌లను సైతం ఇంకొకలాగా రాస్తున్నారు. గతంలో గాంధీ భవన్‌లో సన్నిహితంగా మాట్లాడిన మాటలను రికార్డు చేసిన సందర్భాలు ఉన్నాయి. అందుకోసమే జర్నలిస్ట్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాల్సి వస్తోంది. ఆరోగ్య శ్రీ కార్డుల విషయంలో ఎవరికి ఎలాంటి అపోహాలు అవసరం లేదు" అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

11 వందల మంది జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు..

సమాజంలో జర్నలిస్ట్‌ల సమస్యలను దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆనాడే గుర్తించారని తెలిపారు. 11 వందలమంది జర్నలిస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలు ఇవ్వడం సంతోషమని చెప్పారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కొంతమంది బాధ్యతగా వ్యవహరించడం లేదని అన్నారు. రాష్ట్ర విభజన లాంటి అంశాన్నే కాంగ్రెస్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నిర్ణయం తీసుకుందని చెప్పారు. జర్నలిస్టుల సమస్యలు తమ

ప్రభుత్వంలో త్వరగా పరిష్కరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

రాజకీయాలపై సరైన అభిప్రాయం లేదు..

జర్నలిస్టులతో ఫైళ్లు తెప్పించుకునే సంస్కృతి తమ ప్రభుత్వ విధానం కాదని చెప్పారు. అది రెగ్యులర్?గా జరిగే ప్రక్రియ అని వివరించారు. ఎక్కడ ఎలాంటి సమస్య ఉన్న దాని పరిష్కారానికి మాత్రమే తాము పని చేస్తామని తేల్చిచెప్పారు. వృత్తి పరమైన గౌరవాన్ని జర్నలిస్టులు పెంచుకోవాలని సూచించారు. ఇప్పటి రాజకీయాలపై సరైన అభిప్రాయం ప్రజల్లో లేదని అన్నారు. రాజకీయాలు, రాజకీయ నాయకులు అన్న ప్రజల్లో చిన్నచూపు ఉందని తెలిపారు. కేవలం కుటుంబ సభ్యుల కోసం పని చేస్తారనే అపవాదు ప్రజల్లో ఉందని విమర్శించారు. గతంలో అసెంబ్లీ సమావేశాలు జరిగినప్పుడు లోపలికి వెళ్లే అవకాశం లేదని చెప్పారు. గతంలో ముఖ్యమంత్రి కార్యాలయంలోకి వెళ్లే అంశం దేవుడేరుగు అని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు.

గతంలో సెక్రటేరియట్?కు వెళ్లే పరిస్థితి లేదు..

సిద్ధాంత పరమైన అంశాల కోసం మాత్రమే అప్పట్లో రాజకీయ పార్టీలు, పత్రికలు పెట్టుకున్నాయని గుర్తుచేశారు. దీనికి నిదర్శనం కమ్యూనిస్టు పార్టీలని తెలిపారు. గత ప్రభుత్వంలో సెక్రటేరియట్?కు ప్రజా ప్రతినిధులు కూడా వెళ్లే పరిస్థితి లేదని అన్నారు. ఈరోజు జర్నలిస్ట్‌లు సైతం సచివాలయంలోకి వెళ్లవచ్చని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

రాద్ధాంతం సృష్టిస్తున్నారు..

కొంతమంది జర్నలిస్ట్‌లు సెక్రటేరియట్?లో అనవసర రాద్ధాంతం సృష్టిస్తున్నారని ఆరోపణలు చేశారు. అలాంటి జర్నలిస్ట్‌లకు విలువ లేదని స్పష్టం చేశారు. ఎవరిని చూసిన తాము యూట్యూబ్ జర్నలిస్టులమని అంటున్నారని... కొందరు ఇంకేదో జర్నలిస్టులమని చెబుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు.

మున్నేరు తగ్గుముఖం..
ఖమ్మం ఊపిరిపీల్చుకో!

ఖమ్మం : ఒకటి కాదు రెండు కాదు పదిరోజులుగా ఖమ్మం ప్రజలను మున్నేరు వణికిస్తున్న సంగతి తెలిసిందే. ఇన్నిరోజులు బిక్కుబిక్కుమంటూ బతికిన ఖమ్మం వాసులు ఇక ఊపిరి పీల్చుకోవచ్చు. మున్నేరు కాస్త తగ్గుముఖం పట్టింది. ఒక్క అడుగు తగ్గి 15 అడుగుల వద్ద నీటి ప్రవాహం కొనసాగుతోంది. శనివారం అర్ధరాత్రి వరకూ మున్నేరు వేగంగా పెరిగిన సంగతి తెలిసిందే. అయితే.. రాత్రి 2 గంటల నుంచి మున్నేరు తగ్గుతూ వస్తోంది. సరిగ్గా ఈ పరిస్థితుల్లోనే మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో ఖమ్మం ప్రజల్లో మళ్లీ దడ మొదలైంది. అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం.. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలు, పునరావాస కేంద్రాలకు చేర్చడానికి సన్నాహాలు చేస్తున్నారు. మరోవైపు.. మధిర మండలం చిలుకూరు వద్ద రోడ్డుపైకి కట్టలేరు వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో.. ఖమ్మం నుంచి ఏపీకి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఖమ్మం నగరంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటించారు. పునరావాస కేంద్రాలను పరిశీలించిన ఆయన.. వరద బాధితులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఆహారం, తాగునీరు, వైద్యసాయంపై ఉప ముఖ్యమంత్రి ఆరా తీశారు. వరద బాధితులను ఆదుకునేందుకు ఎంత ఖర్చు అయినా సరే వెనకాడబోమని భరోసా ఇచ్చారు.

ఆదుకుంటాం..

మరోవైపు.. ఖమ్మం జిల్లా మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా వరద బాధితులను పరామర్శించారు. వరదలపై కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం నివేదిక పంపాల్సి ఉందని.. తెలంగాణకు సాయం చేసి.. ఆదుకునేందుకు కేంద్రం

సిద్ధంగా ఉందన్నారు. 'ఇటువంటి విపత్కర పరిస్థితిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పని చేయాలి. కేంద్రం రాష్ట్రం వద్ద అడ్వాన్స్ డిజాస్టర్ ఫండ్ కింద రూ. 1300 కోట్లు పంపించింది. ఇటువంటి పరిస్థితుల్లో రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవ చేయాలి. వరదపై రాజకీయం చేయడం సరికాదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మున్నేరు వరద బాధితులకు అండగా ఉంటాయి. వరదల్లో నష్టపోయిన ప్రతి ఒక్కరికి సాయం అందిస్తాం' అని కిషన్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఫ్లైట్‌లో వెళ్లడానికి వాతావరణం అనుకూలించక పోవడంతో ట్రైన్‌లోనే ఖమ్మం వెళ్లిన కిషన్ రెడ్డి.. సుమారు మూడు, నాలుగు గంటలపాటు ఖమ్మం మున్నేరు, పాలేరు నియోజకవర్గంలోని రాకాసి తండలో పర్యటించారు.

ఒకప్పుడు వేరు..

మరోవైపు.. ఉమ్మడి ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం రాకాసి తండాలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. రాష్ట్ర వ్యాప్తంగా గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు అనేక జిల్లాలు జలమయం అయ్యాయని తెలిపారు. నష్టపోయిన వారికి అండగా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి మొన్న వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ఇవాళ మరో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వచ్చారన్నారు. కేంద్ర బృందం వచ్చి నష్టాన్ని అంచనా వేసి పంపించాలని కిషన్ రెడ్డి సెక్రటరీని ఆదేశించారన్నారు. ఇక్కడ జరిగిన విపత్తుని దేశ విపత్తుగా తీసుకోవాలని కేంద్రాన్ని పొంగులేటి కోరారు. రాజకీయాలు ముఖ్యం కాదని.. ప్రజలను కాపాడటమే ముఖ్యమని కేంద్రం చేయూత అందిస్తోందన్నారు. తెలంగాణ అంటే గతంలో లాగా ధనిక తెలంగాణ కాదని ప్రధాన మంత్రికి తెలియజేశామన్నారు.

కూల్చి వేతలకు చెక్ పెట్టనుందా?

హైదరాబాద్ : హైడ్రాపై మధ్య తరగతి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. పెద్దలను వదిలి పేదలపై ఉక్కుపాదం మోపుతుండటం ప్రజలు తీవ్ర ఆగ్రం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి సమాచారం లేకుండా, కనీసం ఇంట్లోని సమాను తీసుకునే సమయం ఇవ్వకుండా ఇండ్లు కూల్చివేస్తుండటంతో పేదలు, మధ్య తరగతి వర్గాల నుంచి వ్యతిరేకత వస్తున్నది. కూల్చివేతలను నిరిసిస్తూ పలుచోట్ల పేదలు ఒంటిపై పెట్రోలు పోసుకొని ఆత్మహత్యాయాన్నికి పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కీలక ప్రకటన చేశారు. ఆల్రెడీ నివాసం ఉంటున్న గృహాలను కూల్చం. కొత్త నిర్మాణాలు మాత్రమే కూలుస్తున్నామని వివరణ ఇచ్చారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉన్న నిర్మాణాలు స్థలాలు ఇకపై కొనవద్దని హైడ్రా సూచించింది. దీంతో ఇక హైడ్రామాకు హైడ్రా చెక్ పెట్టనుందా? అనే అనుమానాలు వ్యక్త మవుతున్నాయి. కాగా, నగరంలో మరోసారి హైడ్రా కూల్చి వేతలు మొదలయ్యాయి. మాదాపూర్ సున్నం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న ఇండ్లను హైడ్రా అధికారులు కూల్చేశారు. హైడ్రా కూల్చివేతలపై పేదలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమను అన్యాయం చేస్తున్నారని ఆరోపిస్తూ ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. గమనించిన పోలీసులు వారిని అక్కడ నుంచి తరలించే ప్రయత్నం చేయడంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి.

కాంగ్రెస్ పాలనలో రైతుల కష్టాలు

-మొదటిపేజీ తరువాయి

పెట్టావ్.. చేసిందేమో కేవలం రూ. 17 వేల కోట్లు మాత్రమే. పార్లమెంట్ ఎన్నికల ముందు దేవుడి మీద ఒట్టు పెట్టి పంద్రాగస్టు లోగా రుణమాఫీ పూర్తి చేస్తా అంటివి. ఇవాళ రేషన్ కార్డు నిబంధన పెట్టి.. తల్లికి, పిల్లల మధ్య గొడవ పెడితివి. కుటుంబ బందాల మధ్య చిచ్చు పెట్టినవ్. నీ దరిద్రపు గొట్టు రాజకీయం వల్ల మీ పాలనలో కుటుంబ బంధాలన్నీ కూడా చెడిపోతున్నాయి. కేసీఆర్ పాలనలో తల్లులను పిల్లలు సరిగా చూడడం లేదని 200 ఉన్న పెన్షన్‌ను రూ. 2 వేలు చేసి కుటుంబ బంధాలను బలోపేతం చేశారు. కానీ నీవు కోతలు పెట్టడానికి రుణమాఫీ డబ్బు తగ్గించడానికి కుటుంబాల మధ్య చిచ్చు పెట్టన చరిత్ర రేవంత్ రెడ్డిది, కాంగ్రెస్ పార్టీది అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

వరదలపై రాజకీయం సరికాదు

ఖమ్మం: మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి పర్యటించారు. ఖమ్మం నగరంలోని 16వ డివిజన్ దంసాలపురం, తిరుమలాయపాలెం, రాకాసి తండాలో వరదముంపు బాధితులతో కేంద్ర మంత్రి మాట్లాడారు. వీధుల్లో తిరుగుతూ అక్కడి పరిస్థితిని స్వయంగా తెలుసుకున్నారు. వరదల్లో కొట్టుకుపోయిన ఇళ్లను పరిశీలించి బాధితులను ఓదార్చారు. నిత్యావసరాల పంపిణీ, పునరావాస కార్యక్రమాలపై ఆరా తీశారు. కిషన్ రెడ్డితోపాటు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీలు విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. "ప్రకృతి వైపరిత్యాలు వంటి విపత్కర పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాలి. ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవ చేయాలి. తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం అడ్వాన్స్ డిజాస్టర్ ఫండ్ కింద రూ.1,300 కోట్లు పంపింది. వరదపై రాజకీయం చేయడం సరికాదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మున్నేరు వరద బాధితులకు అండగా ఉంటాయి. వరదల్లో నష్టపోయిన ప్రతి ఒక్కరికీ సాయం అందిస్తాం. వర్షాలకు సర్వం కోల్పోయిన వారిని చూస్తుంటే బాధేస్తోంది. రాజకీయాలకు అతీతంగా బాధితులను ఆదుకుందాం. రాష్ట్ర ప్రభుత్వం వరద బాధితుల కోసం సహాయక కార్యక్రమాలు వేగవంతం చేయాలి. తెలంగాణ ప్రభుత్వం నుంచి నివేదిక వచ్చిన తర్వాత కేంద్ర బృందాలు పర్యటించి పంట, పశుసంపద నష్టంపై అంచనాలు తయారు చేస్తారు. అనంతరం బాధితులకు వికాస్ మేనేజ్మెంట్ కింద సహాయం చేస్తాం" అని చెప్పారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితోపాటు తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. ఎన్నికల వరకే రాజకీయాలని, ఇలాంటి సమయాల్లో పార్టీలన్నీ ప్రజలకు సేవ చేసేందుకు కలిసి ముందుకు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ప్రజలకు సేవ చేయడం పక్కనపెట్టి రాజకీయ విమర్శలు చేయడం సరికాదని శ్రీనివాస రెడ్డి అన్నారు. ఇళ్లు కోల్పోయిన ప్రతి ఒక్కరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తాయని మంత్రి హామీ ఇచ్చారు. బ్యాంకులు తెరిచిన వెంటనే తక్షణ సాయం కింద మున్నేరు వరద బాధితుల అకౌంట్లో నగదు వేస్తామని మంత్రి శ్రీనివాస రెడ్డి చెప్పారు.

హైడ్రా నోటీసులపై
మురళీమోహన్ ఫస్ట్ రియాక్షన్..

JAYABHERI
THE SUMMIT

హైదరాబాద్: జయభేరీ కన్‌స్ట్రక్షన్స్‌కు హైడ్రా నోటీసులు.. గత 24 గంటలుగా ఎటు చూసినా ఇదే చర్చ.. అంతకుమించి రచ్చ!. ఎన్ కన్వెన్షన్ తర్వాత జే కన్‌స్ట్రక్షన్ వంతు వచ్చేసింది..! ముహూర్తం కూడా ఫిక్స్ అయ్యింది.. 15 రోజుల్లో నేల మట్టం అంటూ మీడియాలో, సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై చిత్ర విచిత్రాలుగా కథనాలు వచ్చాయి కానీ.. 'వాళ్లకు వాళ్లుగా కూల్చితే సరే లేకుంటే మేమే కూల్చేస్తాం' అంటూ హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చెప్పారో ఒక్కసారిగా సీన్ మారిపోయింది. ఎట్టకేలకు హైడ్రా ఇచ్చిన నోటీసులపై టాలీవుడ్ సీనియర్ నటుడు మురళీమోహన్ స్పందించారు.

మూడు అడుగులే..

మీడియాలో వస్తున్న వార్తలపై స్పందించిన మురళీమోహన్ తాను ఎలాంటి ఆక్రమణలకు పాల్పడలేదని క్లారిటీ ఇచ్చుకున్నారు. ' నేను ఆక్రమణలకు పాల్పడలేదు. 33 ఏళ్లుగా రియల్ ఎస్టేట్ రంగంలో ఉన్నాను. ఏనాడూ ఎలాంటి అవకతవకలకు పాల్పడలేదు. బఫర్ జోన్‌లో ఉంటే నేనే కూల్చేస్తాను. స్థానికుల ఫిర్యాదుతో హైడ్రా ఆధికారులు వచ్చారు. బఫర్ జోన్‌లో మూడు అడుగుల మేరకు.. రేకుల షెడ్డు ఉన్నట్టు అధికారులు గుర్తించి నోటీసులు ఇచ్చారు. ఆ రేకుల షెడ్డును మేమే తొలగించేస్తాం.. హైడ్రా రానక్కర్లేదు. రెండ్రోజుల్లో (మంగళవారం లోపు) తాత్కాలిక షెడ్డును తొలగిస్తాం ' అని మురళీ మోహన్ స్పష్టం చేశారు. దీంతో కొన్ని గంటలుగా మురళీ మోహన్‌పై వచ్చిన చిత్ర విచిత్రాలుగా వచ్చిన కథనాలు, విమర్శకులకు చెక్ పెట్టినట్లు అయ్యింది.

తొలగిస్తే సరే..

హైడ్రా అధికారులు నోటీసులు ఇచ్చిన తర్వాత ఆ సంస్థ చీఫ్ ఏవీ రంగనాథ్ కూడా స్పందించారు. ' హైదరాబాద్‌లోని నానక్ రామ్‌గూడ రంగలాల్ చెరువులో నటుడు మురళీ మోహన్ జయభేరి కన్‌స్ట్రక్షన్స్ నిర్మాణాలకు నోటీసులు జారీ చేశాం. ఫిర్యాదులు రావడంతో చెరువును పరిశీలించాం. ఆక్రమణ జరిగినట్లుగానే మా పరిశీలనలో తేలింది. వారంలో రోజుల్లో ఎఫ్‌టీఎల్‌లో ఉన్న నిర్మాణాలను తొలిగించేందుకు జయభేరి సంస్థ గడువు కోరారు. ఆక్రమణలు తొలగించకపోతే హైడ్రా కూల్చివేస్తుంది' అని రంగనాథ్ హెచ్చరించారు. ఇదిలా ఉంటే.. సండే అయినా సరే కూల్చుడే అంటూ హైడ్రా నాన్ స్టాప్‌గా, దూకుడు మీద కూల్చివేతులు షురూ చేసింది. ఇవాళ ఒక్కరోజే భారీగా కూల్చివేతలు జరిగాయి. మాదాపూర్, మేడ్చల్ జిల్లా మల్లంపేట్, సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ పెద్ద చెరువు వద్ద.. ఎఫ్టీఎల్, బఫర్ జోన్‌లలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చేస్తోంది. ఇక మాదాపూర్ సున్నం చెరువులో కూడా హైడ్రా కొరడా ఝులిపించింది. సున్నం చెరువు మొత్తం విస్తీర్ణం 26 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న షెడ్డులను భారీ బందోబస్తు మధ్య హైడ్రా కూల్చేసింది.

సంపాదకీయం

గ్రిగ్ వర్కర్లుగా నిరుద్యోగులు జీవనం

పాలకుల ప్రకటనకు చేపట్టే విధానాలకు పొంతన లేకుండా పోయింది. ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ చేయకుండా ఉద్యోగ కల్పన పేరుతో ప్రైవేటు పెట్టుబడిదారులకు, కార్పొరేట్లకు నిరుద్యోగుల నైపుణ్యాన్ని పెంపొందించేందుకు సబ్సిడీలు ఇస్తే ఉద్యోగ కల్పన సాధ్యమా? పెట్టుబడిదారుల మూలధన సాంద్రత (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్) ప్రాతిపదికన ఉత్పత్తి కార్యక్రమాలు చేపట్టడం వలన నిరుద్యోగ సమస్య తీరదు. శ్రమ సాంద్రత, ఉత్పత్తి పద్ధతులకు వాళ్లు ఎప్పుడో మంగళం పాడారనే విషయం పాలకులకు తెలియదా1991 నుంచి సరళీకుత ఆర్థిక విధానాలు (లిబరలైజేషన్ ప్రైవేటైజేషన్ గ్లోబలైజేషన్)చేపట్టిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేట్ పరం చేయడం జరుగుతున్నది. 2013లో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో 17.3 లక్షల ఉద్యోగాలు ఉండగా 2022 నాటికి ఉద్యోగాలు 10 లక్షలకు తగ్గిపోయాయి. అందులోనూ కాంట్రాక్టు కార్మికులుగా 43% మందికి నియామకాలు జరిగాయి. ఇలా దేశంలో మెల్లగా ప్రైవేటు రంగం విస్తరించి కార్పొరేట్ రంగానికి పునాదులు బలంగా ఏర్పడడంతో ఉద్యోగ కల్పన లేక నిరుద్యోగులు గ్రిగ్ వర్కర్లుగా జీవనం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అభివృద్ధి అంటే అందరి వృద్ధి అంతేగాని కొందరి వృద్ధి కాదని గాంధీజీ అన్నారు. దేశ ఆదాయం ఎంత అనేది ముఖ్యం కాదు. ప్రజలకు కనీస అవసరాలైన తిండి, వసతి, విద్యా, వైద్యం ఏ మేరకు జరుగుతున్నది అనేది ముఖ్యం. దేశ ప్రజల స్వయం పోషకత్వం ఉద్యోగ కల్పనతోనే సాధ్యం. ఒక దేశ ఆర్థిక వ్యవస్థ ఎంత పటిష్టంగా ఉందో నిర్ణయించడంలో కీలక అంశం నిరుద్యోగం. ఉత్పత్తి కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొంటే ఆదాయాలు పెరిగి వస్తు సేవలకు గిరాకీ ఏర్పడి వస్తు సేవల ఉత్పత్తి అవసరం ఇంకా పెరిగి ఉద్యోగ కల్పన జరిగే అవకాశాలు మెరుగవుతాయి. తద్వారా ప్రజల ఆదాయాలు, దేశ ఆదాయం పెరిగి ఆర్థిక వ్యవస్థ స్థాయి ఐదవదా, నాలుగవదా అనేది నిర్ణయింపబడుతుంది. అంతేగాని దేశంలో పేదరికం, నిరుద్యోగిత విపరీతంగా ఉండి ఆర్థిక వ్యవస్థ ఎంత పెద్దదైనా ఏమి ప్రయోజనం. 2047 కల్లా దేశాన్ని ప్రపంచంలోనే వృద్ధి రీత్యా అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చాలి అనుకుంటున్నారు పాలకులు. ఉద్యోగరీత్యా మాత్రం కాదు. 2014లో మన ప్రధాని బాధ్యతలు చేపట్టినప్పుడు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు మరలా ఉద్యోగ కల్పన కోసం, వివిధ పథకాల నిర్వహణ కోసం రెండు లక్షల కోట్లు కేటాయించి 4.1 కోట్ల మందికి ఉద్యోగ కల్పన చేస్తానని అంటున్నారు. కానీ మొదటి ఎనిమిది సంవత్సరాల కాలంలో 7.2 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చామని లోక్‌సభలో మినిస్ట్రీ ఆఫ్ పర్సనల్ అఫైర్స్ తెలియజేసినారు. నిరుద్యోగిత సమస్య లేనే లేదు. దేశంలో నిరుద్యోగిత 3.2 శాతానికి తగ్గిపోయినట్లు పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే వెల్లడించిందని కేంద్ర ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. 2014-23 సంవత్సరాల మధ్యకాలంలో కోటి 25 లక్షల ఉద్యోగాలను సృష్టించినట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పరిశోధక విభాగం నివేదిక వెల్లడించిందని ఆర్థిక మంత్రి తెలిపారు. అవి రెండు ప్రభుత్వ నివేదికలే. కానీ సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఏకానమీ (సిఎంఐ) ఈ డేటా ఆ నివేదికల వివరాలకు విరుద్ధంగా ఉన్నది. దేశంలో నిరుద్యోగిత ప్రస్తుతం 9.2%గా ఉన్నదని ఆ ప్రతిష్టాత్మక పరిశోధనా సంస్థ పేర్కొంది. భారత్‌లో నిరుద్యోగులుగా ఉన్నవారిలో 83 శాతం మంది యువజనులేనని అంతర్జాతీయ కార్మిక సంస్థ ఐఎల్ఓ వెల్లడించింది. ఉద్యోగ అవకాశాలు పెరిగిపోతున్నాయని ఒక వైపు చెబుతూనే కోట్ల కోట్లకు నిరుద్యోగులు ఉన్నారని చెప్పడం పాలకుల మాటల చాతుర్యమే కదా? ఇండియా ఎంప్లాయిమెంట్ రిపోర్ట్ అనుబంధంగా ఉన్న అంతర్జాతీయ శ్రామిక సంస్థ ప్రకారం మనదేశంలో నిరు ద్యోగం ముఖ్యంగా యువతలో నిరుద్యోగం బలంగా ఉందని చెప్పడం చూస్తుంటే పాలకులు చెప్పే మాటలకు అధికారిక గణాంక వివరాలు తెలియజేసే సంస్థలకు పొంతన లేకుండా పోయింది. రాజకీయ లెక్కలే గాని అధికారిక సంఖ్యాపరమైన సమాచారం నిరుద్యోగంపై ప్రభుత్వాల దృష్టి పెట్టకపోవడం ఎందుకు? ఉద్యోగాల కల్పన విషయంలో భారత్ జి20 సభ్య దేశాలన్నిటికంటే వెనుకబడిందని అంతర్జాతీయ ద్రవ్యనిధి ఐఎంఎఫ్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గీత గోపీనాథ్ అన్నారు. దేశంలో 2030 నాటికి 14.8 కోట్ల అదనపు ఉద్యోగ కల్పించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. 2010లో ప్రారంభమైన దశాబ్దం లో భారత సగటున 6.6% శాతం జీడీపీ వృద్ధిని నమోదు చేయగా ఈ కాలానికి ఉద్యోగాల కల్పన రేటు మాత్రం రెండు శాతానికి పరిమితమైంది. జి20లోని ఇతర దేశాలతో పోలిస్తే భారత ఉద్యోగాల కల్పన చాలా తక్కువగా ఉంది. అయితే మన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రచురించిన కేఎల్ఈఎంఎస్ డేటా ప్రకారం మనదేశంలో 2017-18లో 47.5 కోట్ల ఉద్యోగాల నుండి 2023-24లో 64.33 కోట్ల సంఖ్యకు ఉద్యోగులు పెరిగారని మరొకవైపు చెబుతున్నారు. ఆర్థిక శాస్త్రవేత్తలు దీన్ని ఖండించారు. కరోనా కాలంలో వలస కూలీలందరూ తమ ఊర్లకు వచ్చి వ్యవసాయ రంగంలో పనిచేయడం కూడా ఉద్యోగ కల్పన జరిగినట్లుగా భావించి 2017-18లో 47.5 కోట్లు నుంచి 2023- 24 నాటికి 64.33 కోట్లకు పెరిగింది అని చెప్పడం ఏ కొలబద్ద ప్రకారమనీ, అది ఉద్యోగిత కాదని, గత్యంతరం లేని బతుకుతెరువు మాత్రమేనని అంటున్నారు. 2010-20 మధ్య కాలంలో దేశంలో వృద్ధిరేటు 6.6% మాత్రమే ఉండగా ఉద్యోగ కల్పన రేటు 2 శాతం మాత్రమే నమోదయింది. ఇటువంటి పరిస్థితులలో ఇన్ని కోట్ల మందికి ఉద్యోగ కల్పన ఎలా జరిగిందనేది సందేహమే.

గ్రూప్ ఇన్సూరెన్స్ చందా పెంచాలి!

గతంలో అమలులో ఉన్న కుటుంబ సంక్షేమ పథకం అనగా ఫ్యామిలీ బెనిఫిట్ ఫండ్ స్థానంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉద్యోగుల గ్రూప్ ఇన్సూరెన్స్ పథకం ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 293 ఆర్థిక మరియు ప్రణాళికా శాఖ తేదీ 8.10.1984 ద్వారా ప్రవేశపెట్టారు. తక్కువ ఖర్చుతో బీమా ఫలాలను మరణించిన ఉద్యోగి కుటుంబానికి అందజేయడం, పదవీ విరమణ చేసే నాటికి ఆర్థిక వెసులుబాటు కల్పించే ఉద్దేశంతోఈ పథకం ప్రారంభమైంది. అయితే ఉద్యోగుల, ఉపాధ్యాయుల ప్రయోజనాల కోసం దీనిని ఏర్పరచినప్పటికీ ఈ స్కీంకు సంబంధించిన చందాను అంటే యూనిట్స్‌ను కాలానుగుణంగా పెంచకపోవడం వలన మరణించిన ఉద్యోగికి లభించే మొత్తం మారడం లేదు. చాలా మంది ఉద్యోగులు, కిందిస్థాయి సిబ్బంది, డ్రాయింగ్ అధికారులకు గ్రూప్ ఇన్సూరెన్స్ పథకం గురించి సరియైన అవగాహన ఉండటం లేదని గుర్తించడం జరిగింది. దీంతో కొన్ని సందర్భాల్లో ఉద్యోగి నెల జీతం నుండి వర్తించే గ్రూప్ ప్రీమియం కంటే ఎక్కువ తక్కువ రికవరీ చేయడంతో ఉద్యోగులు నష్టపోయే ప్రమాదం ఉంది. తేదీ 1.11.1984 నాటికి సర్వీస్‌లో ఉన్న ప్రభుత్వ, పంచాయతీరాజ్, మున్సిపల్ ఉద్యోగులు, 10 సంవత్సరాలు నిండి ప్రభుత్వ ఉద్యోగులుగా మారిన వర్క్ ఛార్జడ్ ఉద్యోగులు అలాగే 1.11.1984 తర్వాత నియమితులైన వారు కూడా ఈ పథకంలో సభ్యులుగా ఉంటారు. ఈ పథకంలోని సభ్యులను ఏ,బి,సి,డి అను నాలుగు గ్రూపులుగా.. ఉద్యోగుల వేతన స్కేలు గరిష్ట పరిమితి ఆధారంగా విభజించారు. ఏ గ్రూపు 8 యూనిట్లు, బి గ్రూపు 4 యూనిట్లు, సి గ్రూపు 2 యూనిట్లు, డి గ్రూపు 1యూనిట్ ప్రతినెల సభ్యత్వ రుసుముగా ప్రీమియం చెల్లించవలసి ఉంటుంది. ఈ పథకం మొదలైనప్పుడు ప్రతి యూనిట్ విలువను 10 రూపాయలుగా నిర్ణయించారు. అంటే ఉద్యోగి చెల్లించే ప్రతి యూనిట్ నుంచి ఇన్సూరెన్స్ నిధికి, సేవింగ్స్ నిధికి జమవుతాయి. ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 367 ఆర్థిక, ప్రణాళిక శాఖ తేదీ 15.11.94 ద్వారా యూనిట్ సభ్యత్వ రుసుమును 15/- రూపాయలుగా పెంచారు. ఇందులోంచి 4.50/- బీమా నిధికి, 10.50/- సేవింగ్ నిధికి జమ చేస్తారు. ఎవరైనా ఉద్యోగి నవంబర్లో కాక ఇతర నెలలో నియామకం అయితే వారికి బీమా వర్తించేందుకు వారు ఏ గ్రూపునకు చెందుతారో దానిని బట్టి గతంలో ప్రతి యూనిట్‌కు 3/- అలాగే ప్రస్తుతము 4.50/- చొప్పున నియమిత నెల నుంచి తదుపరి అక్టోబర్ నెల వరకు రికవరీ చేయాల్సి ఉంటుంది. మరల నవంబర్ నెల నుంచి యూనిట్ల మొత్తాన్ని రికవరీ చేయాలి. ఒక ఉద్యోగి సంవత్సరం మధ్యలో పదోన్నతి పొందిన, వేతన స్కేలు గరిష్ట పరిమితి మారినను తదుపరి నవంబర్ నెల నుంచి మాత్రమే అతని గ్రూప్ సభ్యత్వం మారుతుంది. కొన్ని సందర్భాల్లో వెనుకటి తేదీ నుంచి అనగా నోషనల్ ప్రమోషన్ ఇచ్చినప్పటికీ సభ్యత్వ గ్రూప్ రుసుము వెనుకటి తేదీ నుంచి మారదు. ఉద్యోగి సర్వీసులో ఉండగా మరణిస్తే అతని సభ్యత్వ గ్రూపును బట్టి ఎంత ప్రీమియం చెల్లిస్తున్నాడో అన్ని వేల రూపాయలతో పాటు సేవింగ్స్ మొత్తాన్ని అమలులో ఉన్న వడ్డీతో పాటు చెల్లిస్తారు. ఉద్యోగి పదవీ విరమణ లేదా రాజీనామా చేసినను సేవింగ్స్ మొత్తాన్ని వడ్డీతో సహా చెల్లిస్తారు. ప్రభుత్వం కాలానుగుణంగా వడ్డీ రేట్లు మారుస్తుంది. ఈ స్కీంకు సంబంధించిన చందాను అంటే యూనిట్స్‌ను కాలానుగుణంగా పెంచకపోవడం వలన మరణించిన ఉద్యోగికి లభించే మొత్తం మారడం లేదు. ఉదాహరణకు 15/- చందా చెల్లిస్తున్న వ్యక్తి మరణించినట్లయితే 15,000, 30/- చందా చెల్లిస్తున్న వ్యక్తి మరణించినట్లయితే 30,000, 60/- చెల్లిస్తున్న చందా చెల్లిస్తున్న వ్యక్తి మరణించినట్లయితే 60,000 అట్ల గరిష్టంగా 1,20,000 మాత్రమే లభిస్తుంది. ప్రతి ఐదేళ్లకు ఎపిజిఎల్ఐకి సంబంధించిన చందాను పెంచుతున్నారు కానీ గ్రూప్ ఇన్సూరెన్స్ స్కీమ్ సంబంధించిన చందాను పెంచడం లేదు. దీనివల్ల మరణించిన ఉద్యోగులకు ఆశించిన ప్రయోజనాలు లభించడం లేదు. 1994 సంవత్సరంలో పెంచిన సబ్‌స్క్రిప్షన్‌ను గత 30 సంవత్సరాల నుండి పెంచలేదు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి పే రివిజన్ కమిషన్ ఏర్పాటు జరుగుతున్నప్పటికీ, ఏ పే రివిజన్ కమిషన్ కూడా 1998 నుండి 2018 వరకు అంటే 5వ పే రివిజన్ కమిషన్లు గ్రూప్ ఇన్సూరెన్స్ స్కీమ్ సబ్‌స్క్రిప్షన్‌ను పెంచడాన్ని సిఫార్సు చేయలేదు. కానీ దేశంలోని చాలా రాష్ట్రాలలో గ్రూప్ ఇన్సూరెన్స్ సబ్‌స్క్రిప్షన్స్ ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి పెంచడం జరుగుతున్నది. కాబట్టి తెలుగు రాష్ట్రాల్లోనూ గ్రూప్ ఇన్సూరెన్స్ చందాను క్రమానుగతంగా పెంచుకుంటూ పోవడం చాలా అవసరం.

ఆలస్యంగా జరిగే న్యాయం.. న్యాయమేనా?

కలకత్తా ఆర్జీకర్ మెడికల్ కాలేజీలో జరిగిన హేయమైన ఘటన తలుచుకుంటేనే ఒళ్లు గగుర్పాటు వస్తోంది. పోస్టుమార్టం రిపోర్ట్ చూస్తుంటే హృదయం ద్రవించి పోయింది. సగటు మనిషిగా రక్తం మసులుతోంది. ఎందుకీ దారుణం? ఏదీ కారణం? సవతి తల్లి వేధింపులకు గురవుతున్న ఒక బాలిక గాథని సుమోటోగా తీసుకుని పరిష్కారం సూచించిన కోర్టు హత్యాచార ఘటనలను ఎందుకని సుమోటోగా తీసుకోదు? ఘోరం జరిగిపోయిందని ఆయేషా తల్లిదండ్రులు న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే తీర్పురావటానికి నాలుగేళ్లు ఎందుకు పట్టాలి? 'ఆలస్యంగా జరిగే న్యాయం న్యాయమే కాదు' అన్నాడు అంబేద్కర్. కుటుంబ కలహాలను పరిష్కరించడానికి కుటుంబ న్యాయస్థానాలు ఉన్నప్పుడు, మహిళల పట్ల ఇన్ని మారణ హోమాలు, ఇన్ని దారుణాలు, ఇంత క్రూరంగా జరుగుతున్నప్పుడు వాటిని విచారించి సత్వరమే తీర్పునివ్వడానికి మహిళా న్యాయస్థానాలు ఎందుకు ఉండకూడదు? శంషాబాద్‌లో దిశ ఘటన జరిగినప్పుడు ఒంటరి గా నిర్మానుష్య ప్రదేశాల్లో సంచరించడమే కారణమని చాలామంది అన్నారు సరే. మరీ ఈ ఆర్జీకర్ ఘటనలో వైద్యురాలు రోగులకు సేవ చేస్తూ ఆసుపత్రి విధుల్లోనే ఉంది కదా? మరి ఈమె ఎందుకు హత్యాచారానికి గురయింది? ఈ ఘటన నుంచి తేరుకోకముందే మహారాష్ట్రలో నర్సరీ పిల్లలపై అఘాయిత్యం జరిగింది. గత జనవరిలో కర్నూలులో ఒక 60 ఏళ్ల వ్యక్తి తొమ్మిదేళ్ల పాపపై అఘాయిత్యానికి పాల్ప డ్డాడు. కొద్దిరోజుల క్రితం డెహ్రాడూన్‌లో ప్రభుత్వ ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లు ఒక టీనేజీ బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డారు. వివాహాలై, పిల్లలకు తండ్రు లై, ప్రభుత్వ పరిధిలో పనిచేసే వీళ్లకు మహిళల పట్ల ఏ విధమైన బాధ్యతను కలిగి ఉండాలో తెలియదా? మరి ఎందుకని పాశవికంగా ప్రవర్తించారు? దిశ ఘటనలోని నిందితులను ఎన్‌కౌంటర్ చేసి కఠినంగా వ్యవహరించిన పోలీసులు.. అసిఫాబాద్ లో జరిగిన లక్ష్మీ విషయంలో ఎందుకని ఉదాసీనంగా వ్యవహరించారు? కారణం.. దిశ ఘటన నగరంలో జరగడం. అందుకే ఇది ఎక్కువ ప్రచారం అయ్యి ప్రజలు నిరసనలు, ర్యాలీలు పెద్ద మొత్తంలో చేయటంతో ప్రభుత్వం ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి విచారణ వేగవంతం చేసింది. కాకపోతే విచారణ జరుగుతున్నప్పుడే నిందితులు ఎన్‌కౌంటర్ అయ్యారు. ఆసిఫాబాద్ ఘటనలో కూడా బాధితురాలు హత్యాచారం వల్ల కిరాతకంగా చంపబడింది. ఇది మారుమూల ప్రాంతంలో జరిగింది. దిశ ఘటనకు స్పందించిన విధంగా లక్ష్మీ విషయంలో ప్రభుత్వం ఎందుకని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయలేదు? ప్రచార వ్యాప్తిని బట్టి, ప్రజల ఒత్తిడిని బట్టి తీసుకునే చర్య వల్ల జరిగే దాన్ని న్యాయం అంటారా? బాధితులకు న్యాయం చేయడానికి అది ప్రాతిపదిక అవుతుందా? చట్టం దృష్టిలో అందరూ సమానమే అన్న నమ్మకం ఉంటోందా? ఇలా ఒక్కో వ్యక్తికి ఒక్కోలా స్పందిస్తుంటే చట్టం అంటే భయ భక్తులు ఏర్పడతాయా?

పాతికేళ్ల యువకులు నేరం చేస్తే తల్లిదండ్రుల పెంప కం కారణమని అనుకోవచ్చు. కానీ 30 దాటిన వారు, ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న వాళ్లు, 60 సంవత్సరాలు నిండిన వాళ్లు ఇటువంటి అకృత్యాలకు పాల్పడుతుంటే ఎవరి లోపం అనుకోవాలి? ఏది కారణమనుకోవాలి? మానసికంగా సొంత ఆలోచన కలిగి నిర్ణయాలు తీసుకోగలిగిన వీళ్లకు సమాజంలోని మంచి చెడులను గురించి ఏ తల్లి చెప్పాలి? ఏ తండ్రి నేర్పాలి? ఘటనా స్థలం ఇది అదని కాకుండా ఘోరాలు జరుగుతున్నాయి. ఇటువంటి నేరాలకు తల్లిదండ్రుల పెంపకం కూడా ఒక కారణం. ఎందుకంటే సమాజంలో జరిగే సంఘటనల పట్ల కుటుంబం స్పందించే తీరే పిల్లలమానసిక వైఖరిని ప్రభావితం చేస్తుంది. దానిని బట్టే సంస్కారం ఏర్పడుతుంది. అయితే ఎక్కువ మందిలో పెరుగుతున్న కొద్దీ ఆ భావాలు చుట్టూ ఉన్న సమాజం, సంఘటనల ప్రభావం వల్ల మారిపోతూ ఉంటాయి. ఏతల్లి కూడా బూతు మాటలు నేర్పదు. ఏ తండ్రి కూడా మద్యం అలవాటు చేయదు. ఇవి సమాజం నుంచి ఏర్పడ్డ అలవాట్లే. మరి సమాజంలో ఏది మంచో ఏది చెడో ఎవరు చెప్పాలి? బాల్య దశలో తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయుల ప్రభావం కూడా ఉంటుంది పిల్లల మీద. తల్లిదండ్రులకు తెలియని, చెప్పలేని ఎన్నో విషయాలు ఉపాధ్యాయుడు బోధించగలడు. అందుకే 'సమాజ భవిష్యత్తు తరగతి గదిలోనే రూపుదిద్దుకుంటుంది' అన్నారు కొఠారి. ఐతే ప్రస్తుతం టీచర్లు చదువు మాత్రమే నేర్పగలుగుతున్నారు. ఈ చదువు వల్ల కేవలం జ్ఞానం మాత్రమే వస్తుంది. సంస్కారం క్రమశిక్షణ వల్లనే వస్తుంది. తరగతి గదిలో ఉపాధ్యాయులు తమ వృత్తికి పూర్తిస్థాయిలో న్యాయం చేయలేకపోతున్నారు? కారణం క్రమ శిక్షణ తప్పాడని విద్యార్థిని మందలించినందుకు తల్లిదండ్రులే ఉపాధ్యాయునిపై గొడవకు దిగి నానా యాగి చేయడం. ఇలాంటి తల్లిదండ్రులు ఉన్నప్పుడు ఉపాధ్యాయుడు అంటే ఏ విద్యార్థికైనా గౌరవం ఉంటుందా? రోజూ బడికి రావాలి అన్నందుకు బిహార్‌లో ఓ విద్యార్థి టీచర్‌పైకి తుపాకీ గురి పెట్టాడు. ఇట్లాంటి భయానక పరిస్థితులలో ఉపాధ్యాయుడు వేతనజీవి మాత్రమే కాగలడు కానీ గురువు ఎలా అవ్వగలడు? బాల్య దశలో క్రమశిక్షణ ఉంటేనే అది ముమ్మందు మంచి వైపు నడిపిస్తుంది. అలాంటి అవకాశం ఇప్పుడున్న విద్యా వ్యవస్థలో ఉందా? దిశ నిందితుల ఎన్‌కౌంటర్ తర్వాత కూడా కొన్ని అకృత్యాలు జరిగాయి కదా వాటి మాటేమిటి? అందుకే హత్యాచారం శిక్షలు అట్లాగే కొనసాగుతూ ఉంటే 'దెబ్బలకు దేవుడైనా భయపడతాడు' అన్నట్లు తక్కువ కాలంలోనే నేరాలను అరికట్టవచ్చు. శిక్షలు లేకపోతే భయం ఎలా ఉంటుంది? ఒక ఇంటి ముందు 'కుక్క ఉన్నది జాగ్రత్త' అని బోర్డు కనబడితే ఆ కుక్క చిన్నదో పెద్దదో తెలియకపోయినా గేటు తెరవక ముందే అప్రమత్తం అవుతాం. భయం వల్ల ఉండే ప్రతిస్పందన అది. అందుకే రాష్ట్రానికి ఒక మహిళా కోర్టు ఏర్పాటయి నిందితులకు సత్వరమే శిక్ష విధించగలిగినప్పుడే ప్రజల్లో చట్టం పట్ల నమ్మకం, గౌరవం, భయం పెరుగుతుంది. అప్పుడు మాత్రమే ఈ ఘోరాలు చూడకుండా ఉండే అవకాశం ఉంటుంది.

నాణ్యమైన విద్యతోనే పురోగతి

విద్యావంతులు నాయకత్వం వహించే సమాజం సుస్థిర సమగ్రాభివృద్ధి దిశలో పయనిస్తుంది. విద్యతోనే అన్ని సమస్యలకు సమాధానాలు దొరుకుతాయి. పేదరిక నిర్మూలనలో విద్య పాత్ర వెలకట్టలేనిది. ప్రపంచ దేశాల తొలి ప్రయత్నం అక్షరాస్యత రేటును పెంచడం అవుతుంది. అక్షరాస్యులకు ఉన్నత విద్య గొడుగును కల్పిస్తే కుటుంబాల జీవనశైలిలో సమూల మార్పులు చోటు చేసుకుంటాయి. విద్యకు తొలి మెట్టు అక్షరాస్యత మాత్రమే. నిరక్షరాస్య సమాజం నిశీధిలో మగ్గినట్లే. అక్షరాస్యతను విస్తరిస్తే విద్యాకుసుమాల సుగంధం సమాజంలో వ్యాపిస్తుంది. దేశ సమగ్రాభివృద్ధి అక్షరాస్యత రేటుతో ప్రత్యక్ష సంబంధాన్ని కలిగి ఉంటుంది. 2018 గణాంకాల ప్రకారం ప్రపంచ వయోజనుల అక్షరాస్యత రేటు 86 శాతం (పురుషుల్లో 90 శాతం, స్త్రీల్లో 83 శాతం) ఉండగా, భారతదేశ అక్షరాస్యత రేటు 77.7 శాతంగా (పురుషుల్లో 86 శాతం, స్త్రీల్లో 67 శాతం) నమోదు అయ్యింది. ప్రపంచ దేశాల్లో 15-24 ఏండ్ల యువతలో అక్షరాస్యత రేటు 92 శాతంగా ఉంది. ఉన్నత విద్యలో చేరుతున్న భారత యువతకు సంబంధించిన గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జిఈఆర్) 27.1 శాతంగా ఉండగా, ప్రపంచ దేశాల్లో అత్యధికంగా టెర్షరీ స్థాయి విద్య ఆస్ట్రేలియాలో 67 శాతంగా నమోదు అయ్యింది. ప్రపంచంలోని 145 పేద అల్పాదాయ, మధ్య ఆదాయవర్గ దేశాల విద్యారంగాలకు అభివృద్ధి చెందిన దేశాలు చేయూతను ఇవ్వాలి. విశ్వ విద్యకు, ఆరోగ్య కల్పనకు పెద్ద పీట వేయాలి. సామాజిక ఆర్థిక ప్రగతి, పేదరిక నిర్మూలన, అసమానతల తొలగింపు, అధిక జనాభా, శాంతి సామరస్యాల జీవనం లాంటివి విద్యతోనే పరిష్కరించబడతాయి. "ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు-2030" జాబితాలో 4వ లక్ష్యంగా 'నాణ్యమైన విద్య (క్వాలిటీ ఎడ్యుకేషన్)'కు పెద్ద పీట వేశారు. ఐరాస ఎజెండా-2030కి సంబంధించిన 2021 నివేదిక ప్రకారం కోవిడ్-19 కల్లోలం విద్యారంగాన్ని అత్యంత ప్రభావితం చేసిందని తేలింది. విద్యకు విఘాతం కలిగితే అన్ని రంగాలపై దాని దుష్ప్రభావం పడుతుంది. పేదలు, అల్ప ఆదాయ వర్గాల పిల్లల విద్యార్జన కుంటుపడింది. ప్రపంచవ్యాప్తంగా గత పది ఏండ్లలో (2010-19) సెకండరీ విద్య పూర్తి చేసిన యువత 46 శాతం నుంచి 53 శాతానికి పెరిగారు. 2010లో ప్రాథమిక విద్య 70 శాతం ఉండగా, 2018లో 84 శాతానికి పెరిగింది. 2030 నాటికి 89 శాతానికి చేరవచ్చని ఐరాస అంచనా వేస్తున్నాది. కరోనా విపత్తుతో 2030 నాటికి 200 మిలియన్ల ప్రపంచ బాలలు పాఠశాల విద్యకు కూడా దూరంగా ఉంటారని అంచనా. నేటికీ 65 శాతం పాఠశాలల్లో మాత్రమే కనీస వసతులు కల్పించబడి ఉన్నాయి. నిరంతర విద్య కల్పనతో పాటు నైపుణ్య శిక్షణలను పెంపొందించే కృషి జరగాలి. విద్యరంగంలో లింగ వివక్ష మరింత దుష్ప్రభావాన్ని చూపుతున్నది. బాలికలకు విద్యను అందిస్తే అనంతర కాలంలో కుటుంబమే విద్యావంతుల కోవెల అవుతుంది. మహిళా సాధికారతకు మహిళా విద్య ప్రధాన ఆయుధం కావాలి.

మరణించిన బత్తుల బుగ్గమ్మ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 8 శాసనసభ న్యూస్ ప్రతినిధి ఇబ్రహీంపట్నం మండలం తులేకలాన్ గ్రామంలో బత్తుల బుగ్గమ్మ ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ వారి కుటుంబానికి 6500/- రూపాయలు ఆర్థిక సహాయం బి ఆర్ ఎస్ పార్టీ తరపున అందించడం జరిగింది. అదేవిధంగా అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు చేపూరి రాజు అతి చిన్న వయసులోనే మరణించటం చాలా బాధాకరమని, ఈ విషయమై వారి కుటుంబాన్ని పరామర్శించిన బిఆర్ఎస్ నాయకులు 50 కిలోల బియ్యం 7000/- రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో తులేకలాన్ గ్రామ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు మరియు కుటుంబ సభ్యులు పాల్గొనటం జరిగింది.

ఆదిభట్ల మున్సిపాలిటీలో బిజెపి సభ్యత నమోదు కార్యక్రమం

ముఖ్యఅతిథిగా వనపర్తి జిల్లా ఇన్చార్జి, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యులు బోసు పల్లి ప్రతాప్

ఆదిభట్ల, సెప్టెంబర్8 శాసనసభ న్యూస్ ప్రతినిధి ఆదిభట్ల మున్సిపాలిటీలో సభ్యత్వ నమోదు కార్యక్రమం బిజెపి అధ్యక్షులు శిగ వీరస్వామి గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వనపర్తి జిల్లా ఇన్చార్జి, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యులు బోసు పెల్లి ప్రతాప్ హాజరై మాట్లాడుతూ గత పార్లమెంటు ఎన్నికల్లో ఆదిభట్ల మున్సిపాలిటీలో కార్యకర్తలు సైనికులుగా పనిచేసే పోలింగ్ లలో 50% ఓట్లు తీసుకు రావడానికి కృషి చేసిన ఆదిభట్ల మున్సిపాలిటీ బిజెపి నాయకులను, కార్యకర్తలను, రాష్ట్ర జిల్లా మున్సిపాలిటీ నాయకులను, అభినందించడం జరిగినది. అదేవిధంగా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రతి బూతులో 250 కి తగ్గకుండా మనం దేశం కోసం ధర్మం కోసం, భారతీయ జనతా పార్టీ పనిచేస్తుందన్నారు. ప్రజలు బిజెపి మెంబర్షిప్ తీసుకోవడానికి ముందుకు వస్తున్నారని, నరేంద్ర మోడి నాయకత్వంలో దేశ ప్రతిష్టని పెంచుతూ దేశ అభివృద్ధికి బిజెపి చేస్తున్నటువంటి కృషిని అభినందించి దేశంలోనే బిజెపికి 11 కోట్ల సభ్యత్వం కలిగినటువంటి పార్టీ ఒక భారతీయ జనతా పార్టీ కాబట్టి బిజెపి నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరు రంగారెడ్డి జిల్లాలోని ఆదిభట్ల మున్సిపాలిటీకి ప్రత్యేక గుర్తింపు మెంబర్షిప్ లో చేయించి సాధిస్తారని నేను ప్రగాఢ విశ్వాసాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఆదిభట్ల మున్సిపాలిటీ బిజెపి ఫ్లోర్ లీడర్ పొట్టి రాములు, సీనియర్ నాయకులు ఈశ్వర్, భాస్కర్, జిల్లా కార్యవర్గ సభ్యులు సతీష్ గౌడ్, ప్రధాన కార్యదర్శులు నరసింహ్మారెడ్డి, శివకుమార్, మహిళా మోర్చా అధ్యక్షులు శ్రీదేవి, గీత సెల్ కన్వీనర్ యాదయ్య గౌడ్, ఉపాధ్యక్షులు గణేష్ గౌడ్, శేఖర్ రెడ్డి, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి రావుల మహేష్, శ్రీనివాస్ గౌడ్, రవి, హరి, శంకర్ గౌడ్, శేఖర్ గౌడ్, నరసింహ్మా, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుట్ల వెంకట రమణ కాలనిలో సొంత డబ్బులతో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

లిస్విచ్ అన్ చేసి వీధిలైట్లు వెలిగించిన

కాంగ్రెస్ పార్టీ జిల్లానాయకుడు వెదిరే వెంకటరమణారెడ్డి,

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాధగోని జంగయ్య గౌడ్

మంచాల,సెప్టెంబర్ 9 శాసనసభ న్యూస్ ప్రతినిధి మంచాల మండలం ఆరుట్ల గ్రామంలోని వెంకట రమణ కాలనిలో విద్యుత్ స్తంభాలు చాలా దూరంగా ఉండటంతో వెంకట రమణ కాలని వాసులు కరెంటు కష్టాలు ఎదుర్కొంటున్నారని ఎన్నిసార్లు ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోలేదన్నారు. కాలనీవాసుల కోరికమేరకు హామీ ఇచ్చిన ప్రకారం వెంకటరమణ రెడ్డి కాలని వాసులకు ఇచ్చిన మాట ప్రకారం చిందం వెంకటేష్ ఇంటి నుండి దోమ సత్తయ్య ఇంటి వరకూ సొంత డబ్బులతో 5 కరెంట్ స్తంభాలు తీగలు ఏర్పాటు చేసి స్విచ్ ఆన్ చేసి విది లైట్లు వెలిగించిన నాయకధ వెదిరె వెంకట రమణారెడ్డి. ఈ సందర్భంగా కాలని వాసులు వెంకట రమణారెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాధగోని జంగయ్య గౌడ్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు చేయలేని పని వెంకటరమణారెడ్డి చేసి చూపించాడని కాలని వాసులు సంతోషంవ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో వెంకటరమణ కాలని వాసులు కోరే బీరప్ప, రావుల బీరప్ప, బుడిగల జంగయ్య, (మాజీ వార్డ్ మెంబర్) రావుల జంగయ్య, లొంగరి దాసు (ఒగ్గు కళాకారులు), కోరే శ్రీశైలం, కోరే జంగయ్య, దోమ నరసింహ్మా యాదవ్, వైయస్సార్ యువసేన మండల నాయకుడు లొంగరి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఇబ్రహీంపట్నం,సెప్టెంబర్ 9 శాసనసభ న్యూస్ ప్రతినిధి ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు కర్ణంగూడ గ్రామ శివారులో గుర్తుతెలియని వ్యక్తి మృదేహం లభించిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు వద్ద, కర్ణగూడ గ్రామం అవుట్ స్కర్ట్స్ వద్ద ఒక గుర్తు తెలియని వ్యక్తి చనిపోయాడని సమాచారం అందగా సమాచారం అందుకున్న ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, సుమారు 55 సంవత్సరాల వయస్సు గల ఒక గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. ఆవ్యక్తి నీటిలో పడి 5 లేదా 6 రోజుల క్రితం చనిపోయి ఉండవచ్చని ప్రాథమిక అంచనాకు వచ్చారు. మృతదేహాన్ని గుర్తించడం కష్టంగా ఉందని, అది కుళ్ళిన దశలో ఉందన్నారు. మృతదేహం గోధుమ రంగు లాల్చి (చొక్కా),తెల్లటి పైజామా (ప్యాంటు), ఎడమ చీలమండపై ఒక నల్లటి దారం ఉందని, ఇబ్రహీంపట్నం సీఐ సత్యనారాయణ తెలిపారు.

కొండమల్లేపల్లి లో జై రామ్ హాస్పటల్ ప్రారంభం

కొండమల్లేపల్లి,సెప్టెంబర్ 8 శాసనసభ న్యూస్ కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలో జై రామ్ హాస్పిటల్ ను ప్రారంభించిన దేవరకొండ మున్సిపల్ చైర్మన్ అల్లంపల్లి నరసింహ్మా, మాజీ ఎంపీపీ రేఖ శ్రీధర్ రెడ్డి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు మాజీ ఉపసర్పంచ్ కొండమల్లేపల్లి మండల అధ్యక్షులు వేమన్ రెడ్డి. కొండమల్లేపల్లి ప్రెస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాము, చుట్టుపక్కల మండల నాయకులు పాల్గొనడం జరిగింది డాక్టర్ ఉషారాణి, డాక్టర్ భరత్ సింగ్ మాట్లాడుతూ అన్ని రకాల వసతులు జై రామ్ హాస్పిటల్లో ఉన్నాయని అందరికీ అందుబాటులో ఉంటానని తెలియజేయడం జరిగింది. కార్యక్రమానికి విచ్చేసినటువంటి అతిథులకు శాలువాలతో ఘనంగా సత్కరించారు.

వినాయక మండపాలను సందర్శించిన ఇబ్రహీంపట్నం ఎ సి పి,కె పి వి రాజు

యాచారం, సెప్టెంబర్ 08 శాసనసభ న్యూస్ ప్రతినిధి యాచారం మండలంలోని మాల్ లో ఉన్నటువంటి పలు వినాయక మండపాలను శనివారం రోజు ఇబ్రహీంపట్నం ఎ.సి.పి,కె పి వి రాజు సందర్శించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎ సి పి రాజు మాట్లాడుతూ ప్రజలందరూ కూడా శాంతియుత వాతావరణం లో భక్తిశ్రద్ధలతోని గణేష్ నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు.యువకులకు పలు సూచనలు చేస్తు,భక్తి శ్రద్ధలతో పూజ కార్యక్రమాలు నిర్వహించు కోవాలని,భక్తి గీతాలు పెట్టుకోవాలి అని,భజనలు చేయాలని,సినిమా పాటలు పెట్టవద్దు అని చెప్పటం జరిగింది.ఆ విఘ్నేశ్వరుడి దయవల్ల ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆది దేవుడి ఆశీస్సులు మనపై ఉండాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు.ఈ కార్యక్రమం లో యాచారం సి ఐ,శంకర్ కుమార్,మాడ్గుల సి ఐ జగదీష్,ఎస్ ఐ మధు,యాచారం మండలం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్, ఇబ్రహీంపట్నం ఓ బి సి ప్రధాన కార్యదర్శి పోలమోని రామలింగం,జర్నలిస్టులు పల్లపు విజయ్,బట్టు లింగం,మాజీ ఉప సర్పంచ్ బండారు శేఖర్,దేరంగుల రమేష్,చెలిమల బాలకృష్ణ,ఎలుగపల్లి రాజు,జకర్త రవి,నీలం చక్రపాణి,బట్టు సత్యనారాయణ తధితరులు పాల్గోన్నారు.

ప్రతి ఒక్కరూ దైవ చింతన అలమార్చుకోవాలి.

నల్లగొండ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ చింతపల్లి మాజీ జడ్పీటిసి. కంకణాల ప్రవీణ వెంకట్ రెడ్డి

చింతపల్లి, సెప్టెంబర్ 8 శాసనసభ న్యూస్ ప్రతినిధి ప్రతి ఒక్కరూ దైవ చింతన అలమార్చుకోవాలని నల్లగొండ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ చింతపల్లి మాజీ జడ్పీటిసి కంకణాల ప్రవీణ వెంకట్ రెడ్డి అన్నారు.వినాయక చవితి పండుగను పురస్కరించుకుని చింతపల్లి మండలం గొల్లపల్లి గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడికి నల్లగొండ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ చింతపల్లి మాజీ జడ్పీటిసి కంకణాల ప్రవీణ వెంకట్ రెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలందరికి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎవరికీ ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా ఉండాలని ఆ గణనాథుని కోరామన్నారు.గణనాథుడి యొక్క కరుణాకటాక్షాలు అందరి మీద ఉండాలని,ఏవరు ఏ పని మొదలుపెట్టినా ఎలాంటి విఘ్నాలు లేకుండా పూర్తియ్యేటట్టు చూడాలని ఆ మహాగణపతిని మనస్ఫూర్తిగా కోరుకోవడం జరిగిందన్నారు..ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ నక్కనమోని ప్రేమలత పరమేష్,మాజీ వార్డు సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ముంపు బాధితులను ఆసుకునేందుకు ఎంతైనా ఖర్చు చేస్తాం

ప్రజలంతా మన బిడ్డలే

వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులకు ఉప ముఖ్యమంత్రి ఆదేశాలు

ఖమ్మం : ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజాప్రభుత్వం రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తోంది. తాజాగా సంభవిస్తున్న ప్రకృతి వైపరీత్యాల సమయంలోనూ కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజప్రభుత్వం ప్రజల కోసం 24చీ7 అందుబాటులో ఉంది. ప్రజల సమస్యలు తీర్చేందుకు నిరంతరం తపిస్తోంది. ఖమ్మం జిల్లాలో ఆదివారం కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో మరోసారి మున్నేరువాగు నగరాన్ని ముంచెత్తే ప్రమాదకర పరిస్థితులు తలెత్తాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హుటాహుటిన ఖమ్మం నగరానికి బయలుదేరారు. ప్రమాదకర పరిస్థితులు తలెత్తవచ్చన్న వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో రాత్రి 7 గంటల ప్రాంతంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హైదరాబాద్ నుంచి ఖమ్మం బయలు దేరారు. దారి మొత్తం కుంభవృష్టి కురుస్తున్న పరిస్థితుల మధ్య ప్రజా సంక్షేమం తప్ప మరేమీ పట్టించుకోకుండా భట్టి విక్రమార్క రాత్రి 11.30 గంటల సమయంలో ఖమ్మం చేరుకున్నారు. వెంటనే వరద ముంపు ప్రభావిత ప్రాంతమైన కాలువొడ్డు చేరుకుని అక్కడ ప్రజలతో మాట్లాడారు. వరద ముంపు అధికంగా ఉండడంతో ప్రజలంతా సురక్షిత ప్రాంతాలకు లేదంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని సూచించారు. అనంతరం కాలవొడ్డు వద్ద మున్నేరు బ్రిడ్జి దగ్గర వరదను పరిశీలించారు. అక్కడనుంచి ఖమ్మం పట్టణంలో మరోసారి మున్నేరు వాగు వరద ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో అర్ధరాత్రి 12 గంటల సమయంలో స్వర్ణ భారతి పునరావాస శిబిరంలో వరద ముంపు బాధితులని పరామర్శించారు. పునరావాసకేంద్రంలో ఉంటున్న బొక్కల గడ్డకు చెందిన వందకు పైగా కుటుంబాలతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్వయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి అందుతున్న సహాయసహకారాలపై వరదబాధితులతో మాట్లాడారు. భోజన ఏర్పాట్లు వైద్య పరమైన అంశాలను పర్యవేక్షించారు. బాధితులకు దుప్పట్లు తదితర సౌకర్యాలు కల్పించాలి అని అధికారులను ఆదేశంచారు. అక్కడనుంచి వరద ముంపు బాధితుల కోసం ఖమ్మం నగరంలోని మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన పునరాదశ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ముంపు బాధితులకి సమయానికి ఆహారం, అనారోగ్యం ఏర్పడితే అందిస్తున్న వైద్య సేవలు గురించి బాధితులతో మాట్లడారు. అక్కడే ఉంటున్న బొక్కల గడ్డ ప్రాంతానికి చెందిన మరో యాభై కుటుంబాల ను పరామర్శించి ఏర్పాట్ల గురించి అడిగారు.

అర్థారాత్రి 1 గంట సమయంలో ఖమ్మం అర్బన్ మండలం ధంసలాపురం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని అర్ధరాత్రి రాత్రి పొద్దు పోయాక పరిశీలించారు. ఈ సందర్భంగా ముంపు బాధితుల వద్దకు వెళ్లి వారితో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో వారికి అందుతున్న ఆహారం, వైద్యం, ఇతర మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. చిన్న అనారోగ్యం వచ్చిన అధికారులు తక్షణం స్పందించి తమకు మందులు అందిస్తున్నారని బాధితులు ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం ప్రజలను అప్రమత్తం చేసి పునరావాస కేంద్రానికి స్వయంగా తరలిస్తున్న జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో ఉప ముఖ్యమంత్రి మాట్లాడారు. పై జిల్లాల లో ఇంకా వర్షాలు తగ్గలేదు.. మున్నేరు కాలవకు క్రమక్రమంగా వరద పెరుగుతుంది.. ఈ నేపథ్యంలో కాబట్టి ముందస్తుగా మున్నేరువాగు చుట్టుపక్కల ప్రజలను ఖాళీ చేయించి పునరావాస కేంద్రాలకు తరలించాలని ఉప ముఖ్యమంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భారీగా కురుస్తున్న వర్షాలకు ముంపు బాధితులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలో ఉన్నది ప్రజల కోసం పనిచేసే ప్రజా ప్రభుత్వం.. ప్రజల ప్రభుత్వం, ఈ ప్రజా ప్రభుత్వం ప్రజల కోసం మాత్రమే పనిచేస్తుందని అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టంగా చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరు మన బిడ్డలేనన వారిని ఆదుకోవడం ప్రభుత్వ కర్తవ్యం అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టంగా చెప్పారు. వరద ముంపు బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎంత ఖర్చు అయినా పెట్టేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అన్ని రకాల జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టంగా ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్, స్థానిక వైద్య, రెవెన్యూ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాటంతో బీజేపీకి సంబంధం లేదు

హైదరాబాద్ : తెలంగాణ సాయుధ పోరాటం చరిత్ర పుటల్లో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గది. కానీ, నేడు ఈ చరిత్రకు సంబంధంలేని మతోన్మాద శక్తులు వాస్తవికతను వక్రీకరిస్తూ హిందు, ముస్లిం పోరాటంగా చిత్రీకరిస్తున్నారు. మత చాందసవాదులు కుట్రలను వక్రీకరణను తిప్పికొడుతూ తెలంగాణ సాయుధ పోరాటాన్ని వాస్తవికత చరిత్రను ప్రజల్లో విస్తృత ప్రచారం చేసి తెలంగాణను లౌకిక ప్రజాస్వామ్యం వైపు నడిపించాలని సీపీఐ మాజీ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో సీపీఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను నాలుగు భాషలు ముద్రించి ప్రచురించిన బుక్లెట్‌ను ఆవిష్కరించారు. అంతకుముందు తెలంగాణ సాయుధ పోరాట సేనాని కామ్రేడ్ రావి నారాయణరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు, ప్రజాపీడకులైన దొరలు, దేశముఖ్ లకు మధ్య జరిగిన తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తూ మతం రంగు అద్దుతున్నారు. తెలంగాణ సాయుధ పోరాట వాస్తవిక గాథ నేటి యువతరానికి తెలియాల్సి ఉంది. వేల ఎకరాల భూములు ఆక్రమణకు గురయ్యాయి. మహిళలపై అఘాయిత్యాలు జరిగేవి మాట వినకపోతే క్రూరమైన శిక్షలు విధించేవారు. ఈ కష్టాల కడలి నుంచి బయటపడాలని ఆలోచిస్తున్న క్రమంలో ఆంధ్రమహాసభ ఉద్యమం ప్రారంభ మైందన్నారు. కమ్యూనిస్టు పార్టీ గ్రామాల్లో ప్రజలను సంఘటితం చేసి, భూస్వామ్య వ్యతిరేక పోరాటాన్ని నిర్మించింది. రైతుల పంటలను భూస్వాములు లాక్కుంటున్న తరుణంలో ప్రజలు తిరగబడ్డారు. చేతికి దొరికిన ఆయుధంతో దొరల గూండాలను తరిమి కొట్టారు. అనంతరం 1947 సెప్టెంబర్ 11న కమ్యూనిస్టు పార్టీ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిందని పేర్కొన్నారు. ప్రజలు బందూకులు చేతబట్టి దొరలను గడగడలాడించారు. ఇలాంటి మహత్తరమైన సాయుధ పోరాట చరిత్రను అభాసుపాలు చేసి వక్రీకరించడం ద్వారా రాజకీయ లబ్దిని పొందాలని బీజేపీ చూస్తున్నదని మండిపడ్డారు. బీజేపీ మోసపూరితమైన కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలి. సెప్టెంబర్ 11-17 మధ్య తెలంగాణ సాయుధ పోరాటాన్ని స్మరించుకుందామన్నారు.

మంత్రులు కిషన్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని అడ్డుకున్న వరద బాధితులు

హైదరాబాద్ : ఖమ్మం జిల్లాలో వరద భాదితులను పరామర్శించేందుకు వెళ్లిన మంత్రులు కిషన్ రెడ్డి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి తీవ్ర నిరసన సెగ ఎదురైంది. ఆదివారం ఖమ్మం జిల్లా దంసలాపురంలో పర్యటించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మరో మంత్రి పొంగులేటి కారును వరద బాధితులు అడ్డుకున్నారు. వర్షాలకు సర్వస్వం కోల్పోయి రోడ్డున పడ్డామని, తమకు ఎలాంటి సహాయం అందలేదని బాధిత మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి ఎలాంటి సహాయం అందలేదని, తమను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. వారి వెంట ఉన్న ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, తదితరులు ఉన్నారు. కాగా, ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షానికి ఖమ్మం జిల్లాలోని మున్నేరుకు వరద ఉధృతి పెరిగింది. ప్రస్తుతం వరద ప్రవాహం 16 అడుగులకు చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. 24 అడుగులకు చేరితే రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో వరద ప్రభావిత కాలనీల్లోని బాధితులను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. ఖమ్మం మున్నేరు పరివాహక ప్రాంతం డేంజర్ జోన్‌లో ఉంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆదివారం అర్ధరాత్రి మళ్లీ వరద వచ్చే అవకాశం ఉంది. దీంతో రెండు రోజుల పాటు వరద ప్రభావిత ప్రాంతాల్లో రోడ్లన్నీ బ్లాక్ చేయాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

సురేందర్ రెడ్డిది ఆత్మహత్య కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వ హత్య

హైదరాబాద్ : నిన్న మేడ్చల్ వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట ఆత్మహత్య చేసుకున్న సురేందర్ రెడ్డిది ఆత్మహత్య కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వ హత్య అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. రైతు రుణమాఫీకి సంబంధించిన అంశంపై హరీశ్‌రావు తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఈ రోజు ఈ సమావేశం కొంత బాధతో దుఃఖంతో పెడుతున్న ప్రెస్ కాన్ఫరెన్స్. రైతు రుణమాఫీ విషయంలో ఈ ప్రభుత్వం చేస్తున్న వంచన, దుర్మార్గ పద్ధతులపై, అన్నదాతల పట్ల ఆవేదనతో మాట్లాడుతున్నాను. నిన్న రైతు సురేందర్ రెడ్డి రుణమాఫీ జరగలేదని ఆత్మహత్య చేసుకున్నారు. మేడ్చల్ వ్యవసాయ శాఖ కార్యాలయం ముందు చెట్టుకు ఉరేసుకున్నాడు. 9 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలన రైతుల పాలిట యమపాశంగా మారింది. దానికి సాక్ష్యం సురేంద్ రెడ్డి ఆత్మహత్య. ఆయన తన సూసైడ్ నోట్‌లో స్పష్టంగా రాశారు. బ్యాంక్ పాస్ బుక్ మీదనే సూసైడ్ నోట్ రాశారు. నా చావుకు కారణం క్రాప్ లోన్ మాఫీ కాకపోవడం. నా చావుకు కారణం క్రాప్ లోన్ చిచ్చు. సురేందర్ రెడ్డితో పాటు ఆయన తల్లి.. ఇద్దరు ఒకే రేషన్ కార్డులో ఉండడం వల్ల రుణమాఫీ కావడం లేదు. ఇద్దరికి క్రాప్ లోన్ ఉంది. రేషన్ కార్డు ఒకటే ఉండడంతో ఒక్కరికే రుణమాఫీ అవుతుందని అన్నారట బ్యాంక్ మేనేజర్. దాంతో తీవ్ర కలత చెంది సురేందర్ రెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడని హరీశ్‌రావు తెలిపారు. సురేందర్ రెడ్డి తల్లి సుశీల పేరు మీద 2 ఎకరాల పాస్ బుక్ ఉంది. ఆమెకు రూ. 1,15,662 లోన్ ఉంది. సురేందర్ రెడ్డికి 4 ఎకరాలు.. ఆయన పాస్ బుక్ మీద రూ. 1,92,443 రుణం ఉంది. నాలుగు రోజుల క్రింత ఏపీజీవీబీ బ్యాంక్ వెళ్లి రుణమాఫీ ఎందుకు కాలేదని మేనేజర్‌ను అడిగారు. ఒకే రేషన్ కార్డు ఉండడంతో ఒక్కరికి రుణ మాఫీ అవుతుంది. ఇద్దరికి కలిపి 2 లక్షలు మాఫీ అవుతుంది. మిగతా రుణం చెల్లించాలని బ్యాంక్ మేనేజర్ అనిరుధ్ సురేందర్ రెడ్డికి చెప్పారట. దాంతో మానసికంగా కలత చెందిన సురేందర్ లక్షా 10 వేలు కట్టాలని కుటుంబ సభ్యులకు చెప్పి బాధపడి ఇంట్లో నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. చివరకు మేడ్చల్ వ్యవసాయ శాఖ కార్యాలయం ముందు చెట్టుకు ఉరేసుకుని చనిపోయారని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఈ సూసైడ్ నోట్ సాక్షిగా రేవంత్ రెడ్డిని అడుగుతున్నా.. పంద్రాగస్టు నాడు రుణమాఫీ అయిపోయిందని చెప్పావు..? అయిపోతే సురేందర్ రెడ్డి ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడు. మీరే చెప్పారు కదా రేషన్ కార్డుతో లింక్ లేదని. రుణమాఫీ గైడ్ లైన్స్ వచ్చిన రోజే అసెంబ్లీలో ప్రెస్ మీట్ పెడితే.. రేషన్ కార్డుతో లింక్ లేదని కొద్ది గంటలకు చెప్పారు. కానీ లింక్ ఉన్నది.. కాబట్టే బ్యాంక్ మేనేజర్లు రేషన్ కార్డు ప్రకారం రుణమాఫీ చేశారు. అందుకే సురేందర్ రెడ్డి ఆత్మహత్య చేసుకున్నారు. ప్రభుత్వం చెబుతున్న మాటలకు చేతలకు పొంతన లేదని స్పష్టమవుతుంది. రుణమాఫీ లబ్దిదారులను ఆంక్షల పేరుతో వేధిస్తున్నవ్. నీవు పన్నిన పన్నాగం రైతుల మెడకు ఉరి తాడైంది. రాజకీయంగా బ్లఫ్ చేద్దామనుకున్నావ్.. నీ బ్లఫ్‌కు మూల్యం సురేందర్ రెడ్డి మరణం. సురేందర్ రెడ్డి నోట్‌లో ప్రతి అక్షరం నీ దురాగాతన్ని, నీ రాజకీయ దివాళాకోరుతనాన్ని, నీ నగ్న స్వరూపాన్ని ఇవాళ బజారులో నిలబెట్టిందని చెప్పక తప్పదు. ఈ సూసైడ్ నోట్ నీ దుష్ట పాలన మీద తెలంగాణ రైతులు రాసిన పంచనామా అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

ఇది కష్ట సమయం ప్రజలు ధైర్యంగా ఉండాలి

ఖమ్మం : ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా పాలేరు నియోజకవర్గం తిరుమలాయపాలెం మండలం రాకాసి తండా లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ప్రధాన మంత్రి ఆదేశాలతో మిమ్మల్ని కలవడానికి మిమ్మల్ని పరామర్శించి ఇక్కడ పరిస్థితుల్ని పరిశీలించడానికి వచ్చాను. రాకాసితండా ప్రజలు వరద కారణంగా సర్వస్వం కోల్పోయారు నిరాశ్రయులుగా మిగిలారు. పంట పొలాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి పొలాలన్నీ ఇసుక మేటలుగా గా మారాయి. ఈ కష్ట సమయంలో ఈ గ్రామస్తులకు అండగా నిలవలసిన అవసరం ఉంది గ్రామస్తులు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలని కోరారు . ప్రజల కోరిక మేరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అందరి ఆమోదం మేరకు రాకాసితండాను సురక్షిత ప్రాంతానికి మార్చే ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. పంట పొలాల్లో ఇసుక మేటను తొలగించి ఆర్థిక సాయం అందించి రైతులు సాగు చేసుకునే విధంగా చేయాలి. ఇది కష్ట సమయం ప్రజలు ధైర్యంగా ఉండాలి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వరద బాధితులకు అండగా ఉంటాయి.. మిమ్మల్ని ఆదుకునే బాధ్యత ప్రభుత్వాలు తీసుకుంటాయని అన్నారు

కారులో మంటలు

నల్గొండ : నల్లగొండ జిల్లా పరిధిలోని హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వెళ్తున్న ఓ కార్ లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. చిట్యాల సమీపంలోని జియో బంకు దగ్గర కారు ఇంజిన్ లోంచి పొగలు రావడంతో.. అందులో ప్రయాణిస్తున్న వారు వెంటనే కారు రోడ్డు పక్కన ఆపేసి.. ప్రాణాలకు అరచేతిలో పెట్టుకొని బయటికి పరుగులు తీశారు. వారి కళ్ళ ముందే కారు కాలిపోతునీడటంతో నిశ్చయస్టులై నిలుచున్నారు. కారులో బ్యాటరీ లేదంటే ఇంజిన్ సమస్య కారణంగా మంటలు తలెత్తి ఉండొచ్చని తెలుస్తుంది. టాటా కంపెనీకి చెందిన బోల్ట్ కారు కావడం గమనార్హం. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది.. వచ్చి కారులో తలెత్తిన మంటలను ఆర్పేశారు. అప్పటికి కారు దాదాపు సగభాగం పూర్తిగా దగ్ధమైంది.

హైడ్రా కూల్చివేతల దూకుడు

హైదరాబాద్ : హైదరాబాద్ లో హైడ్రా కూల్చివేతలు శరవేగంగా జరుగుకున్నాయి.. దుండిగల్ మున్సిపాలిటీ పరిదిలోని కత్వ చెరువులో 170/1సర్వే నెంబర్ లో వెలిసిన 8విల్లాలను నేలమట్టం చేస్తున్నారు హైడ్రా అధికారులు .. మల్లంపేట్ కత్వ చెరువు ఎఫ్టిఎల్ విస్తీర్ణం 142 ఎకరాలు మల్లంపేట్ లో లక్ష్మి శ్రీనివాస కన్స్ట్రక్షన్ పేరుతో 2020-21 సంవత్సరానికే 320విల్లాస్ లను కన్స్ట్రక్షన్ చేసింది ఈ సంస్థ..అప్పటికే 60విల్లాలకు మాత్రమే ఊఓఆం పర్మిషన్ తీసుకున్న ఈ సంస్థ మిగతావన్నింటిని పోర్జరీ పర్మిషన్ తో కన్స్ట్రక్షన్ చేసిందన్న ఆరోపణలతో అప్పటి మేడ్చల్ కలెక్టర్ హరీష్ నేతృత్వంలో డిపిఓ ఆద్వర్యంలో ఎంక్వైరీ చేసి 208విల్లాలకు ఇల్లీగల్ కన్స్ట్రక్షన్ అని నోటీసులు జారీచేసి సీజ్ చేశారు..హై కోర్ట్ ఆదేశాలతో ఈ అక్రమవిల్లాలకు కరెంట్ కనెక్షన్,వాటర్ కనెక్షన్,రిజిస్ట్రేషన్ లను ఆపాలని,బ్యాంక్ అధికారులు లోన్ లను నిలిపి వెయ్యాలని ఆర్డినెన్స్ జారీచేశారు..చట్టంలో ఉన్న లొసుగులతో దుండిగల్ మున్సిపాలిటీ అధికారుల ధనదహానికి అక్రమ విల్లాలన్ని సక్రమవిల్లాలుగా మారిపోయాయి..పర్మిషన్ తో సంబంధం లేకుండా ఇంటినెంబర్ ల ఆధారంగా,డబుల్ పన్ను విధించి కుడా రిజిస్ట్రేషన్ లు చేయొచ్చనే కొత్త ఒరవడిని దుండిగల్ మున్సిపాలిటీ తీస్కొచ్చి రిజిస్టేషన్ లు చేసింది..ఏదిఏమైన హైడ్రా రంగంలోకి దిగి గత ఆదివారం ఈ కత్వ చెరువును విజిట్ చేసి ఈరోజు ఎఫ్టిఎల్ ఉన్న 3విల్లాలు,బఫర్ లో ఉన్న 5విల్లాలను నేలమట్టం చేశారు

వరదల విషయంలో పూర్తి వైఫల్యం

హామీల అమలులోఓ అట్టర్ ప్లాప్

నల్లగొండ : కాంగ్రెస్ ప్రభుత్వం వరద సాయం, రుణమాఫీ అమలుపై మాజీమంత్రి జగదీష్ రెడ్డి మండిపడ్డారు. పరిపాలన, వరదల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది. హామీల అమలులో అట్టర్ ప్లాప్. రైతు రుణమాఫీలో అంతా గందరగోళం. ఇంతవరకూ.. 10 వేల కోట్లు మాఫీ కాలేదు. రుణమాఫీపై వ్యవసాయ మంత్రి, ఇతర మంత్రుల మాటలు అయోమయానికి దారి తీస్తున్నాయి. మళ్ళీ 2014 ముందు లాంటి విద్యుత్ కష్టాలు మొదలైయ్యాయి. మంత్రులు పరిపాలన గాలికి వదిలేసి.. వ్యక్తిగత సంపాదనలో పడ్డారు. హామీలు నమ్మి రైతులు ఓట్లు వేస్తే.. కుచ్చుటోపీ పెట్టి మోసం చేస్తున్నారు. అసలు ఋణామాఫీ చేసే ఆలోచన ఉందా..? లేదా..? వ్యవసాయ మంత్రి సమాధానం చెప్పాలి. వరదలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి. వరదలపై ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళిక లేదు. వరద బాధితుల ఇళ్లకు పోయే దమ్ము మంత్రులకు ఉందా..? 2లక్షలకు పైనున్న డబ్బు మాఫీ చేయాలని.. రుణమాఫీపై స్పష్టతను ఇవ్వాలని డిమాండ్ చేసారు.

టీపీసీసీ ఛీఫ్ మహేష్ కుమార్‌కి ఎంపి చామల శుభాకాంక్షలు

హైదరాబాద్ : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ నూతన అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ని హైదరాబాద్ లోని వారి నివాసంలో భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసారు. టీపీసీసీ అధ్యక్షుడిని శాలువాతో సత్కరించి పుష్ప గుచ్చాలతో శుభాకాంక్షలు తెలిపారు. అయనతోపాటు టిపిసిసి మీడియా కోఆర్డినేటర్ శ్రీకాంత్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

సెన్సేషనల్ కంపెనీ సరుకుల వితరణ

డోర్నకల్ : మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఉల్లె పల్లి గ్రామంలో ముంపు బాధిత కుటుంబ సభ్యుల కు సెన్సేనల్ గ్రూప్ ఆఫ్ కంపనీ ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. మరిపెడ సీఐ రాజ్ కుమార్ ఈ కార్యక్రమానికి హాజరయ్యి అందచేసారు. అనంతరం సిఐ మాట్లాడుతూ ముంపు బాధిత కుటుంబ సభ్యులను ఆదుకోవాలనే ఆలోచన ఓ కంపెనీకి రావడం అభినందనీయం అన్నారు..మరింత మందికి తమ సేవ గుణం తో సహాయం అందచేయాలని కోరారు..ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ ఐ సతీష్ కుమార్ పాల్గొన్నారు

విద్యుత్ ఘాతంలో వినాయక విగ్రహం దగ్ధం

హైదరాబాద్ : అంతా ఒక్క క్షణంలోనే ముగిసిపోయింది. దిల్సుక్ నగర్ లోని పి అండ్ టీ కాలనీలో ప్రతి సంవత్సరం ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈసారి అదే విధంగా నిర్వహించే క్రమంలో కొత్తగా పత్తి తో డెకరేషన్ చేశారు అంతా పూర్తయింది అనుకునే లోపు మెయిన్ స్విచ్ ఆన్ చేసే మరో సెకండ్ కె ఒక్కసారిగా షాక్ సర్క్యూట్ తగిలి విద్యుత్ ఘాతుకానికి కాలి బూడిద అయిపోయింది , దైవ అనుగ్రహం ఉండడం వల్ల ఏ ఒక్కరికి కూడా చిన్న గాయం కాలేదు అప్పుడే ఐదు నిమిషాల ముందు మండపం వద్ద ఉన్న చిన్నారులు అందరు తమ ఇంటికి వెళ్ళారు , అల వెళ్లి తిరిగి వచ్చేసరికి ఇలా జరిగిపోయింది మండపం వద్ద చిన్నారులంతా కన్నీరు మున్నీరయ్యారు.

మున్నేరు ప్రవాహ ప్రాంత ప్రజల్లో భయం భయం

జగ్గయ్యపేట : మున్నేరుకు గంట గంటకు పెరుగుతున్న వరద ప్రవాహం తో స్థానిక ప్రజలు భయాందోళనలో వున్నారు. వత్సవాయి మండలం పోలంపల్లి డ్యామ్ వద్ద 13 అడుగుల మేర వరద ప్రవాహం ప్రవహిస్తోంది. మరో రెండు అడుగులు వరద ప్రవాహం పెరిగితే పెనుగంచిప్రోలు మున్నేరు బ్రిడ్జి పై నుంచి వరద ప్రవహించే అవకాశం వుంది. దాంతో రాత్రికి రాత్రే అధికారులు అప్రమత్తం ముప్పు ప్రాంత ప్రజలను ఖాళీ చేయాలంటూ ఆదేశాలు ఇచ్చారు. శనివారం న్న మధ్యాహ్నం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. ఎగువున కురుస్తున్న వర్షాలకు మున్నేరుకు వరద ప్రవాహం పెరగడంతో మున్నేరు ప్రవాహ ప్రాంత ప్రజలు ను అధికారులు అప్రమత్తం చేశారు. వత్సవాయి మండలం పెనుగంచిప్రోలు మండలం నందిగామ మండలంలోని పలు గ్రామాలు లోని ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు . ఖమ్మంలో కురుస్తున్న వర్షం కు అక్కడి అధికారులు అప్రమత్తం అవడంతో ఇక్కడ అధికారులు ముందస్తుగా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. గత వారం రోజుల క్రితమే వరద ఉధృతి పెరిగి తగ్గడంతో మరోసారి వరదరావడంతో ప్రజలు భయాందోళనలు నెలకొన్నాయి.

బిజినెస్

భారీగా తగ్గిన బంగారం ధరలు

వినాయకచవితి సందర్భంగా శనివారం స్వల్పంగా పెరిగిన బంగారం ధరలు.. ఆదివారం భారీగా తగ్గాయి. తులం బంగారం ధర నిన్నటితో పోల్చితే రూ.410 తగ్గింది. 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.72,870లు ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.66,800ల వద్ద కొనసాగుతోంది. ఈ ఏడాది భారత్‌లో బంగారం వినియోగం భారీగా పెరిగే అవకాశం ఉందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ అంచనా వేస్తున్నందున.. ధరలు అమాంతం పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. కాబట్టి.. గోల్డ్ కొనేవారికి ఇప్పుడే మంచి అవకాశం. దేశంలోని వివిధ ప్రాంతాలతోపాటు, తెలుగు రాష్ట్రాల్లో బంగారం ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం. కోల్‌కతాలో10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 66,800గా ఉండగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ.72,870 వద్ద ఉంది.

దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగార ధర రూ.66,950కాగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 73,020 వద్ద కొనసాగుతోంది.

చెన్నైలో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 66,880గా ఉండగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 72,870 వద్ద కొనసాగుతోంది.

ముంబయిలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 66,800గా ఉండగా, 24 క్యారెట్ల ధర రూ. 72,870వద్ద ట్రేడవుతోంది.

తెలుగు రాష్ట్రాలు..

తెలుగు రాష్ట్రాల్లోనూ బంగారం ధరలు తగ్గాయి. హైదరాబాద్‌లో ఇవాళ10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 66,800గా ఉండగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 72,870గా ఉంది. విజయవాడలో కూడా 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 66,800, 24 క్యారెట్ల బంగారం ధర రూ.72,870గా ఉంది. విశాఖపట్నం సహా ఏపీలోని ప్రధాన నగరాల్లోనూ ఇవే ధరలు కొనసాగుతున్నాయి.

వెండి ధరలు...

ఢిల్లీలో కిలో వెండి ధర రూ. 84,500గా ఉండగా.. కోల్‌కతాలో రూ. 85 వేలు, బెంగళూరులో రూ. 82,900 వద్ద ట్రేడవుతోంది. హైదరాబాద్, విశాఖ, విజయవాడలో కిలో వెండి ధర అత్యధికంగా రూ. 89,500 గా ఉంది.

రిటైర్ మెంట్ వరకు రూ. 8 కోట్లు కావాలంటే..

నెలకు ఎంత సేవ్ చేయాలి

ప్రస్తుత కాలంలో చాలా తక్కువ మంది మాత్రమే పదవీ విరమణ కోసం ప్లాన్ చేస్తున్నారు. కానీ ఇప్పటి నుంచే పదవీ విరమణ కోసం కొంత డబ్బును ఆదా చేస్తే ఆ సమయంలో ఎవరిపై ఆధారపడకుండా ప్రశాంతంగా ఉండవచ్చు. సాధారణ ఆదాయం కోసం ప్రజలు ఇప్పటికే వివిధ పథకాల్లో పెట్టుబడి పెడుతున్నారు. అయితే మీరు రిటైర్ మెంట్ సమయంలో పలు రకాల ఖర్చుల కోసం రూ.8 కోట్లు రావాలని ప్లాన్ చేసుకుంటే ఎందులో పెట్టుబడి చేయాలి. ఎన్నేళ్లు ఇన్వెస్ట్ చేయాలనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం.

ఎంత సేవ్

దీర్ఘకాంలో పెట్టుబడులు చేయాలంటే మ్యూచువల్ ఫండ్స్‌లో సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్‌లు బెస్ట్ అని చెప్పవచ్చు. ఎందుకంటే ఇటీవల సంవత్సరాలలో భారతదేశంలో ఇవి మంచి ప్రజాదరణ పొందాయి. దీంతోపాటు వీటిలో కనీసం 10 శాతానికి పైగా రిటర్న్స్ వస్తుండటంతో అనేక మంది వీటివైపు మొగ్గుచూపుతున్నారు. వీటిని పెట్టుబడిదారులు చిన్న మొత్తంతో కూడా ప్రారంభించవచ్చు. అయితే రూ.8 కోట్ల మొత్తం కావాలంటే నెలకు ఎంత సేవ్ చేయాలి, ఏన్నేళ్లు పెట్టుబడి పెట్టాలనే విషయాలను ఇప్పుడు చూద్దాం.

వడ్డీ రూపంలోనే

ఇక రిటైర్ మెంట్ సమయానికి రూ.8 కోట్ల కార్పస్ కావాలంటే నెలకు రూ. 12,320 సిప్ విధానంలో పెట్టుబడి పెట్టాలి. ఆ క్రమంలో 35 ఏళ్లు ఇన్వెస్ట్ చేయాలి. ఆ విధంగ చేస్తే మీ మొత్తం పెట్టుబడి రూ.51,74,400 అవుతుంది. అదే సమయంలో మీకు వచ్చేది మాత్రం రూ. 8 కోట్ల 00 21 వేల 715 వస్తుంది. ఈ నేపథ్యంలో మీకు 7 కోట్ల 48 లక్షల 47 వేల 315 రూపాయలు వడ్డీ రూపంలోనే లభిస్తుంది. వార్షిక రాబడి 12 శాతం చొప్పున తీసుకుంటే ఈ మొత్తం వస్తుంది. సిప్ విధానంలో ప్రస్తుతం వార్షిక రాబడి 12 శాతానికి పైగా లభిస్తుంది.

అదనంగా

ఒకవేళ మీకు ఇదే సమయంలో రాబడి 15 శాతం వస్తే మీకు అదనంగా మరో 10 కోట్లు ఎక్కువ వస్తాయి. అంటే మొత్తం రూ. 18 కోట్ల 30 లక్షల 83 వేల 145 లభిస్తాయి. మీరు కూడా మీ పదవీ విరమణ తర్వాత పెద్ద మొత్తాన్ని పొందాలనుకుంటే ఈ సిప్ విధానాన్ని ఎంచుకోవచ్చు. మీరు తక్కువ వయసులో పెట్టుబడి ప్రారంభించడం ద్వారా పదవీ విరమణ సమయానికి ఎక్కువ మొత్తాన్ని పొందవచ్చు. గమనిక: మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టడం అనేది మార్కెట్ రిస్క్‌లకు లోబడి ఉంటుంది. ఏదైనా పెట్టుబడి పెట్టే చేసే ముందు నిపుణుల సలహాలు తీసుకోవడం ఉత్తమం.

బ్యాంకుల్లో డిపాజిట్ చేసేవారు తరిగిపోతున్నారు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6: డిపాజిట్లు ఆకట్టుకోవడంలో బ్యాంకులు విఫలమవుతున్నాయి. ఒకవైపు రుణాలు తీసుకునేవారి సంఖ్య పెరుగుతున్నప్పటికీ ఇదే తరుణంలో డిపాజిట్ చేసేవారు తరిగిపోతున్నారు. దీంతో బ్యాంకింగ్ రంగం తీవ్ర సంక్షోభం నెదుర్కొంటున్నది. ఈ విషయాన్ని రిజర్వు బ్యాంక్ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలంలో బ్యాంకింగ్ డిపాజిట్లలో 11.7 శాతం వృద్ధిని నమోదు చేసుకోగా, ఇదే సమయంలో రుణాల్లో వృద్ధి 15 శాతంగా ఉన్నదని పేర్కొంది. ఈ రెండింటి మధ్య అంతరం అంతకంతకు పెరుగుతుండటంపై అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రిజర్వుబ్యాంక్‌లు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. ముఖ్యంగా డిపాజిట్లను ఆకట్టుకోవడానికి బ్యాంకింగ్‌లు ప్రత్యేక దృష్టి సారించడం లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బహిరంగంగానే విమర్శించారు. ఆకర్షణీయమైన డిపాజిట్లను ప్రకటించాలని సూచించారు. ఈ నెలమొదట్లో ప్రభుత్వ బ్యాంకుల అధిపతులతో సమావేశమై ఈ విషయాన్ని సూచించారు.

ఈక్విటీలు అధిక రిటర్నులు

గతంలో బ్యాంక్‌లలో డిపాజిట్ చేయడానికి ముందుకొచ్చిన ప్రజలు..ప్రస్తుతం అధిక రిటర్నులు పంచే వాటివైపు మొగ్గుచూపుతున్నారు. దీంట్లో రిస్క్‌వున్న ఈక్విటీ మార్కెట్లలో పెట్టుబడులు పెడుతున్నారు. ముఖ్యం గా ఈ ఏడాదికాలంలో డీమ్యాట్ ఖాతాలు పెరిగిందన్న నివేదిక ఈ విషయాన్ని బహిర్గతం చేస్తున్నది. ఈ ఏడాదికాలంలో ఈక్విటీలు 14 శాతం రిటర్నులు పంచింది.

దులీప్ ట్రోఫీలో ఇండియా బీ గ్రాండ్ విక్టరీ..

76 పరుగుల తేడాతో ఓటమి

దులీప్ ట్రోఫీ 2024 మొదటి రౌండ్ మ్యాచ్‌లు ముగిశాయి. శ్రేయాస్ అయ్యర్ మాదిరిగానే, స్టార్ ఇండియన్ బ్యాట్స్‌మెన్ శుభ్‌మాన్ గిల్ కెప్టెన్సీలో ఉన్న జట్టు కూడా ఘోర పరాజయాన్ని ఎదుర్కొంది. బెంగళూరు వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో చివరి రోజు అభిమన్యు ఈశ్వరన్ కెప్టెన్సీలోని ఇండియా బీ 76 పరుగుల తేడాతో ఇండియా ఏపై విజయం సాధించింది. ఈ ఓటమి శుభ్‌మాన్ గిల్‌కు మరింత బాధాకరమని చెప్పవచ్చు. ఎందుకంటే అతను బ్యాటింగ్‌లో కూడా విఫలమయ్యాడు. కెప్టెన్సీలో కూడా ప్రభావం చూపలేకపోయాడు. మ్యాచ్ చివరి రోజున భారత్ ఏ విజయానికి 275 పరుగులు చేయాల్సి ఉండగా, 194 పరుగులకే జట్టు కుప్పకూలింది.

ఆకాశ్ దీప్ 5 వికెట్లు

చిన్నస్వామి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో చివరి రోజైన సెప్టెంబర్ 8న భారత్ బీ తన రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 150 పరుగులు చేసింది. వాషింగ్టన్ సుందర్ క్రీజులో ఉన్నప్పటికీ మిగతా 4 వికెట్లు తీయడానికి భారత్ ఏకు ఎక్కువ సమయం పట్టలేదు. కానీ ఫాస్ట్ బౌలర్ ఆకాష్ దీప్ మరోసారి స్టార్ అయ్యాడు. అతను ఈ 4 వికెట్లలో 3 వికెట్లు పడగొట్టాడు. ఇండియా బీని 181 పరుగులకు కట్టడి చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు తీసిన ఆకాశ్.. రెండో ఇన్నింగ్స్‌లోనూ 5 వికెట్లు పడగొట్టి టెస్టు సిరీస్‌లో మరోసారి తన బలాన్ని నిరూపించుకున్నాడు.

అందరూ విఫలం

భారత్ బీ తొలి ఇన్నింగ్స్‌లో 90 పరుగుల ఆధిక్యంలో ఉండి, భారత్ ఏకు 275 పరుగుల లక్ష్యాన్ని అందించింది. ఆ క్రమంలో శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్, మయాంక్ అగర్వాల్, ధ్రువ్ జురెల్, శివమ్ దూబే వంటి వంటి స్టార్లు ఉన్న జట్టు ఆకట్టుకుంటారని అనుకంటే, అది జరగలేదు. మయాంక్, శుభ్‌మన్ గిల్, ర్యాన్, శివమ్‌లతో సహా 6 వికెట్లకు 99 పరుగులు మాత్రమే చేశారు. ఆ క్రమంలో జట్టు ఓటమి దాదాపు ఖారారయ్యిందని చెప్పవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో %ఖా% రాహుల్ చాలా ప్రయత్నాలు చేశారు. తొలి ఇన్నింగ్స్‌లో ఆడలేకపోయిన.. రెండో ఇన్నింగ్స్‌లో రాణించాడు. హాఫ్ సెంచరీ తర్వాత ఔటయ్యాడు. ఆ తర్వాత యశ్ దయాల్, ముఖేష్ కుమార్, నవదీప్ సైనీల పేస్ ఎటాక్ భారత్ ఏను కుదిపేసింది.

పారా క్రీడాకారులకు సెల్యూట్.. 18వ స్థానంలో భారత్

పారాలింపిక్స్‌లో భారత క్రీడాకారులు కొత్త చరిత్ర లిఖించారు. అసమాన పోరాటంతో పారా విశ్వ క్రీడల రికార్డులు తిరగరాశారు. ఈ క్రీడా పండుగ చరిత్రలోనే దేశానికి అత్యధిక పతకాలు అందించారు. దాంతో, భారత్ ఖాతాలో మునుపెన్నడూ లేని విధంగా 29 పతకాలు వచ్చి చేరాయి. పారిస్‌లో మన క్రీడాకారులు పారా విశ్వ క్రీడల్లో 7 స్వర్ణాలు, 9 రజతాలు, 13 కాంస్య పతకాలు కొల్లగొట్టారు. దాంతో, ఈసారి ఇండియా పతకాల పట్టికలో 18వ స్థానంలో నిలిచింది. పారిస్ వెళ్లేముందు.. పారాలింపిక్స్‌లో ఈసారి 25 పతకాలు సాధిస్తాం భారత పారాలింపిక్స్ కమిటీ అని చెప్పినప్పుడు అదే మాట నిజమైతే బాగుండు అనుకున్నారంతా. అయితే.. అంతకంటే నాలుగు పతకాలు ఎక్కువే వచ్చాయి. జావెలిన్ త్రోలో నవ్‌దీప్ సింగ్ స్వర్ణంతో గర్జించాడు. దాంతో, భారత్ పతకాల సంఖ్య 29కి చేరింది.

ఈసారి అథ్లెట్లు ఏకంగా 17 మెడల్స్ సాధించడం విశేషం. పారాలింపిక్స్ ముగింపు వేడుకలు ఆదివారం సాయంత్రం అట్టహాసంగా జరుగనున్నాయి. ఈ కార్యక్రమంలో ఆర్చర్ హర్వీందర్ సింగ్ అథ్లెట్ ప్రీతి పాల్‌లు పతకధారులుగా వ్యవహరించునున్నారు. హర్వీందర్ ఆర్చరీలో తొలి స్వర్ణం గెలుపొందగా.. ప్రీతి అథ్లెటిక్స్‌లో రెండు కాంస్యాలతో ప్రభంజనం సృష్టించింది. పారాలింపిక్స్‌లో షూటర్ అవనీ లేఖరా స్వర్ణంతో పతకాల ఖాతా తెరిచింది. అవనితో పాటు 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో ఫైనల్ చేరిన మోనా అగర్వాల్ కంచు మోత మోగించింది. అక్కడితో మొదలు భారత క్రీడాకారుల పతకాల వేట కొనసాగించారు. అథ్లెటిక్స్‌లో ప్రీతి పాల్ చిరుతను తలపిస్తూ.. 100 మీటర్లు, 200 మీటర్ల పోటీల్లో కాంస్యంతో చరిత్ర సృష్టించింది. ఇక షూటర్ మనీష్ నర్వాల్ రజతం కొల్లగొట్టాడు.. ఆర్చరీ, జావెలన్ త్రో, హైజంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, క్లబ్ త్రో, జూడో, బ్యాడ్మింటన్‌లో భారత క్రీడాకారులు పతకాలతో యావత్ భారతావనిని సంబురాల్లో ముంచెత్తారు.

స్పోర్ట్స్

ముషీర్, దయాల్ విజృంభణ..

ఇండియా బీ సంచలన విజయం

క్రికెట్‌లో ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేం. ఓటమి అంచున నిలిచిన జట్టు అనూహ్యంగా గెలుపొందడం.. విజయం తథ్యమనుకున్న జట్టు దారుణ పరాభవం ఎదురవ్వడం చాలా సందర్భాల్లో చూశాం. ఇప్పుడు భారత దేశవాళీ క్రికెట్‌లోనూ అద్భుతం జరిగింది. ‘ఇండియా బీ’ జట్టు సంచలన విజయం సాధించింది. దులీప్ ట్రోఫీలో ‘ఇండియా ఏ’ను చిత్తుగా ఓడించింది. తొలుత ముషీర్ ఖాన్(181) సెంచరీతో కోలుకున్న ఇండియా బీ.. ఆ తర్వాత బౌలర్ల జోరుతో శుభ్‌మన్ గిల్ బృందానికి చెక్ పెట్టింది. భారీ ఛేదనలో ఇండియా ఏ స్టార్ కేఎల్ రాహుల్(57) హాఫ్ సెంచరీతో పోరాడినా ఫలితం లేకపోయింది. పేసర్లు యశ్ దయాల్(3/50), ముకేశ్ కుమార్(2/50)లు విజృంభించగా.. ఇండియా ఏ జట్టు 76 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. సూపర్ సెంచరీతో మ్యాచ్‌ను మలపుతిప్పిన ముషీర్ ‘ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్’ అవార్డు అందుకున్నాడు.

ఆ ఇద్దరి రికార్డు భాగస్వామ్యం

దులీప్ ట్రోఫీలో స్టార్లతో కూడిన ఇండియా బీ జట్టు ఇండియా ఏకు షాకిచ్చింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇండియా ఏను కట్టడి చేసిన ఇండియా ఏ.. అనంతరం 90/7తో ఆలౌట్ ప్రమాదంలో పడింది. అయితే.. మిడిలార్డర్ బ్యాటర్ ముషీర్ ఖాన్(181) అద్భుతంగా ఆడి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. నవ్‌దీప్ సైనీ(56)తో కలిసి 8వ వికెట్‌కు 205 పరుగుల భాగస్వామ్యంతో జట్టు స్కోర్ 300 దాటించాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో రిషభ్ పంత్(61), సర్ఫరాజ్ ఖాన్(46)లు చెలరేగినా ఆకాశ్ దీప్(5/56) దెబ్బకొట్టాడు. అతడి ధాటికి ఇండియా బీ 184 పరుగులకే కుప్పకూలింది. సూపర్ బౌలింగ్‌తో ఇండియా ఏను పోటీలోకి తెచ్చాడు. కానీ.. ఛేదనలో కీలక ఆటగాళ్లు మరోసారి చేతులెత్తేశారు. అయితే.. కేఎల్ రాహుల్(57), ఆకాశ్ దీప్(43)లు పోరాడినా కూడా ఇండియా ఏకు ఓటమి తప్పించలేకపోయారు.



రిలీజ్‌కు ముందే రికార్డు..

ఓవర్సీస్ ప్రీసేల్‌లో దుమ్మురేపుతున్న ‘దేవర’

ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం ‘దేవర’ జనతా గ్యారేజ్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత వీరిద్దరి కాంబోలో ఈ సినిమా రానుండటంతో భారీ అంచనాలు ఉన్నాయి. ఇక రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ స్టార్ నటుడు సైఫ్ అలీఖాన్ విలన్ పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాను సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. విడుదల తేదీ దగ్గరపడటంతో ఓవర్సీస్‌లో అడ్వాన్స్ బుక్ స్టార్ట్ చేశారు మేకర్స్. అయితే అటు అడ్వాన్స్ బుక్ స్టార్ట్ చేశారో లేదో ప్రీసేల్‌లో 5 లక్షల టికెట్లు బుక్ అయినట్లు టీమ్ ప్రకటించింది. ఇక అమెరికాతో పాటు కెనడాలో కూడా ఈ సినిమా సత్తా చాటుతున్నట్లు చిత్రబృందం తెలపింది. మరోవైపు ఈ సినిమా ట్రైలర్‌ను సెప్టెంబర్ 10న విడుదల చేయనున్నట్లు దేవర టీం ప్రకటించింది. ఈ ట్రైలర్ ఈవెంట్‌ను ముంబైలో భారీ ఎత్తున్న ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది.



వినాయకచవితి స్పెషల్‌గా వచ్చిన ‘కుబేర’ పోస్టర్ వైరల్

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ టాలీవుడ్ కింగ్ నాగార్జున నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటోన్న మోస్ట్-వెయిటెడ్ పాన్ ఇండియా మూవీ ‘కుబేర’ ఈ సినిమాకు సంబంధించిన లీడ్ రోల్స్‌తో సహా రష్మిక మందన్న పాత్రని పరిచయం చేసిన పోస్టర్లు, గ్లింప్స్ హ్యూజ్ రెస్పాన్స్‌ను రాబట్టుకున్న విషయం తెలిసిందే. తాజాగా ధనుష్, నాగార్జునలను ఒకే పోస్టర్ ద్వారా చూపిస్తూ.. యూనిట్ వినాయక చతుర్థి శుభాకాంక్షలు తెలియజేసింది. ప్రస్తుతం ఈ పోస్టర్ వైరల్ అవుతోంది. ఈ పోస్టర్ ఈ సినిమాలో ధనుష్, నాగార్జున పోషించిన పాత్రల మధ్య ఉన్న తేడాను చూపిస్తుంది. ధనుష్ పాత్ర మ్యాసీ హెయిర్, గుబురు గడ్డంతో కనిపించగా.. నాగార్జున లుక్ మోడరన్ అవుట్ ఫిట్స్‌లో స్టయిలీష్ అవతార్‌లో ఉంది. ఈ పోస్టర్ ‘కుబేర’ సినిమా థీం కోర్‌ని ప్రజెంట్ చేస్తోంది. పోస్టర్‌లో చూపించిన డబ్బు కట్టలు, దాని మ్యాప్ ఇమేజ్ మొత్తం కూడా ఓ వైవిధ్యభరిత సినిమాను శేఖర్ కమ్ముల ప్రేక్షకులకు ఇవ్వబోతున్నారనే విషయాన్ని తెలియజేస్తున్నాయి. ప్రస్తుతం ఈ సినిమా నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నట్లుగా మేకర్స్ తెలిపారు. ఇందులో జిమ్ సర్భ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పి, అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్స్ పై సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్ మోహన్ రావు అత్యంత భారీ బడ్జెట్‌తో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా తమిళం, తెలుగు, హిందీ భాషల్లో మల్టీలింగ్వల్ ప్రాజెక్ట్‌గా రూపొందుతోంది.

ఫన్ ఎంటర్‌టైనర్‌గా ‘మత్తు వదలరా 2’ ట్రైలర్

స్వర మాంత్రికుడు ఎమ్.ఎమ్ కీరవాణి తనయుడు శ్రీ సింహా, కమెడియన్ సత్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం ‘మత్తు వదలరా 2’. బ్లాక్ బస్టర్ మూవీ ‘మత్తు వదలరా’కు సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రానికి రితేశ్ రానా దర్శకత్వం వహిస్తున్నాడు. క్రైం కామెడీ నేపథ్యంలో వస్తున్న ఈ సినిమాలో జాతి రత్నాలు ఫేం ఫరియా అబ్దుల్లా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ సినిమాను సెప్టెంబర్ 13న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. విడుదల తేదీ దగ్గర పడటంతో వరుస ప్రమోషన్స్ చేస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి మేకర్స్ ట్రైలర్ విడుదల చేశారు. కామెడీతో యాక్షన్ ప్యాక్డ్‌గా సాగిన ఈ ట్రైలర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. మరోవైపు ఈ సినిమా సెన్సార్ కూడా కంప్లీట్ చేసుకుంది. సెన్సార్ బోర్డ్ ఈ సినిమాకు యూ/ఏ సర్టిఫికేట్ ఇచ్చినట్లు చిత్రబృందం ప్రకటించింది.





ఓటీటీలోకి రాబోతున్న ‘ఆయ్’

గీతా ఆర్ట్స్2 పిక్చర్స్ బ్యానర్ పై బన్నీ వాసు నిర్మాణంలో తెరకెక్కిన తాజా చిత్రం ఆయ్ ఎన్టీఆర్ బావమరిది నార్నే నితిన్, నయన్ సారిక ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాకు అంజి కంచిపల్లి దర్శకత్వం వహించాడు. గోదావరి బ్యాక్‌డ్రాప్‌లో లవ్ అండ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా వచ్చిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకోవడమే కాకుండా.. రూ.15 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. ఇప్పుడు ఈ చిత్రం ఓటీటీ లాక్ చేసుకుంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో ఈ సినిమా సెప్టెంబర్ 12 నుంచి తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ అవ్వనున్నట్లు నెట్‌ఫ్లిక్స్ వెల్లడించింది.

ఈ సినిమా కథ విషయానికి వస్తే.. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుంటాడు కార్తీక్ (నార్నె నితిన్). కరోనా వలన లాక్ డౌన్ రావడంతో తన సోంతఊరు అయిన అమలాపురం వస్తాడు. అయితే అమలాపురంలో వర్క్ ఫ్రం హోమ్ చేసుకుంటునే తన చిన్ననాటి ఫ్రెండ్స్ అయిన హరి(అంకిత్ కోయ), సుబ్బు(రాజ్ కుమార్ కసిరెడ్డి)తో కలిసి సరదాగా గడుపుతుంటాడు. అయితే అదే ఊరిలో ఉన్న పల్లవి (నయన్ సారిక)ని చూసి ఫస్ట్ లుక్‌లోనే ఇష్టం పెంచుకుంటాడు. అయితే ఊరులో ఉండే పల్లవికి సోషల్ మీడియాలో చలాకీగా ఉండడంతో పాటు కులం పట్టింపులు ఎక్కువ. అయితే కార్తీక్ తన కులం వాడే అనుకుని లవ్ చేస్తుంది. అయితే కార్తీక్ కులం వేరని తెలిసిన పల్లవి తన తండ్రి (మైమ్ గోపి) అతడిని చంపేస్తాడని దూరం పెడుతుంది. ఈ క్రమంలో కార్తీక్ ఏం చేస్తాడు. పల్లవి, కార్తీక్‌ల ప్రేమను పల్లవి తండ్రి ఒప్పుకుంటాడా అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

PMR Publication,Thurkayamjal 4-136/12, 9100900918